ప్రజాశక్తి

శనివారం 24 డిసెంబర్ 2022 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి బాబురెడ్డి

మున్సిపల్ ఉపాధ్యాయుల

సమస్యలు పరిష్కరించాలి

పిడిఎఫ్ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి బాబురెడ్డి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మున్సిపల్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని, ప్రధానోపాధ్యాయులకు డిడిఒ కోడ్‌లు కేటాయించకపోవడంతో ప్రతి నెలా జీతాల బిల్లులు చేయడం సమస్యగా మారుతోందని, వెంటనే కోడ్‌లు కేటాయిచాలని పిడిఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పి.బాబురెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఒంగోలు నగరంలోని మున్సిపల్ పాఠశాలలు, కళాశాలల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా బాబురెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న ఇంక్రిమెంట్లు, మెడికల్ లీవులు వివిధ రకాల ఫిక్షేషన్‌లు మంజూరు చేయటానికి చర్యలు తీసుకోవాలన్నారు. పిఎఫ్ అకౌంట్స్ ప్రారంభించాలని, మున్సిపల్ పాఠశాలలకు ఎంఈఓ కార్పొరేషన్‌లకు డిప్యూటీ డిఈఓ పోస్టులు ఇవ్వాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థులు పెద్దసంఖ్యలో పెరిగారని, అందుకు తగిన టీచర్ పోస్టులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులైన పి.బాబురెడ్డి, మీగడ వెంకటేశ్వరరెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి బి.విశ్వనాథ్, నగర అధ్యక్షులు సిహెచ్.లక్ష్మీనారాయణ, బాలరాజు, నారాయణ, మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయాలపై ప్రత్యేక నిఘా

▶ 8లో

రైతులకందే రుణాలు

అంతంత మాత్రమే..

- అవసరాల్లో 30 శాతం కూడా ఇవ్వని బ్యాంకులు
- కౌలు రైతులందరూ ప్రైవేటు అప్పులతోనే సాగు



ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

జిల్లాలో ఖరీఫ్‌లో 4,24,575 ఎకరాల్లో సాధారణ విస్తీర్ణం ఉంది. రబీలోనూ 4.29 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు వేస్తారు. ఎకరాకు పంటను బట్టి కనీసం రూ.25 వేల నుంచి మిర్చి వంటి పంటలకు రూ.లక్ష వరకూ పెట్టుబడి పెట్టాలి. పొగాకుకూ ఎకరాకు రూ.50 వేలకు పైగానే పెట్టుబడి కావాలి. ఈ లెక్కన ఎన్ని వందల కోట్లు పెట్టుబడి అవసరమో చెప్పాల్సిన అవసరం లేదు. అయితే రైతులు సాగు చేసే సమయానికి చేతిలో చిల్లిగవ్వ కూడా ఉండదు. బ్యాంకు రుణాలపైనే ఆశతో సాగులోకి దిగుతారు. పొలం తాకట్టు పెడితే బ్యాంకుల్లో రుణాలు ఇస్తారు. ఇదే రైతులకు పెట్టుబడి.

ఏళ్ల తరబడి బ్యాంకులపైనే రైతులు ఆధారపడుతున్నారు. బ్యాంకుల్లో పరపతి దొరకని రైతులు మాత్రం ప్రైవేటు అప్పులపైనే ఆధారపడుతున్నారు. ఇప్పుడు సాగులో 60 శాతం మంది కౌలు రైతులున్నారు. వీరంతా మిర్చి పొగాకు, పత్తి, శనగ, వరి తదితర పంటలు సాగు చేస్తున్నారు. అయితే అందరూ ప్రైవేటుగా అప్పులు తెచ్చుకుంటున్నారు. కారణం వీరి పేరుతో భూమి లేదు. బ్యాంకులో తాకట్టు పెట్టేందుకు ఏ ఆధారం లేదు. యజమానులే సాగు చేసినా, చేయకపోయినా వారి పాసుపుస్తకాలు బ్యాంకుల్లో తాకట్టు పెట్టి రుణాలు ఏటా తీసుకుంటున్నారు. ఇదంతా బహిరంగంగా జరిగే తంతే. అయితే బ్యాంకులు మాత్రం రైతులకు భారీగా రుణాలు ఇస్తున్నామని చెబుతున్నారు. వారి రుణవార్షిక ప్రణాళికల్లో ఘనంగా రుణ లక్ష్యాలు కనిపిస్తుంటాయి. వాస్తవానికి రైతులకు అవసరమయ్యే పెట్టుబడిలో 30 శాతం మించి రుణాలు ఇవ్వడం లేదు. అంటే 70 శాతం పెట్టుబడికి ఇతర మార్గాలు చూసుకుంటున్నారు. అందుకే ప్రైవేటు బ్యాంకులు, ప్రైవేటు ఆర్థిక సంస్థలు, ఫైనాన్సు కంపెనీలు తెరపైకి వచ్చాయి. రైతులకు బ్యాంకుల బయట అవసరాలే భారీగా ముడిపడిఉన్నాయి. ప్రైవేటు వ్యక్తులు వడ్డీలకు తిప్పే సొమ్ము కూడా రూ.కోట్లలో ఉంది. ఇవేవీ అధికారికంగా కనిపించడం లేదు. ఇవే రైతుల పాలిట శాపాలుగా మారాయి. జిల్లాలో గడిచిన ఐదారేళ్లలో జరిగిన రైతుల ఆత్మహత్యలకు కారణాలను పరిశీలిస్తే అన్నీ అప్పుల బాధలతోనే... ప్రైవేటు అప్పులు ఉసురు తీస్తున్నాయి. బ్యాంకు అప్పుకు తోడు ప్రైవేటు అప్పులు ఎంత ఉన్నాయో.. ఆత్మహత్యలు చేసుకున్న రైతుల కుటుంబాల్లో చిట్టాలు ఉన్నాయి. ఇప్పటికే బ్యాంకులు రూ.వేల కోట్లు బడా బాబులకు మాఫీ చేశాయి. ఒక్క రైతుకు కూడా మాఫీ చేయలేదు. చనిపోయాక తప్ప రైతులకు ఎవరికీ ఈ అవకాశం ఇవ్వడం లేదు.

రుణప్రణాళికలను పరిశీలిస్తే 2022-23 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకుల రుణప్రణాళికలో వ్యవసాయానికి రూ.7,871.89 కోట్లు కేటాయించారు. పంట రుణాలతో పాటు భూఅభివృద్ధి, ఉద్యానవనం, డెయిరీ, పౌల్ట్రీ, చేపల పెంపకం, ఇతర వ్యవసాయ అనుబంధ రంగాలకు ఈ కేటాయింపులు చేశారు. ఖరీఫ్, రబీలో పంట రుణాలకు ▶ 2లో

నష్టపోయిన

ప్రతి రైతునూ ఆదుకుంటాం

- యుద్ధ ప్రాతిపదికన ఎన్యూమరేషన్ పూర్తి
- అధికారులతో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి మేరుగు నాగార్జున

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మాండూస్ తుపాన్‌తో పంట నష్టపోయిన ప్రతి రైతునూ ప్రభుత్వం ఆదుకుంటుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి మేరుగు నాగార్జున తెలిపారు. ఈ దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. స్థానిక కలెక్టర్ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగిన జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. తుపాన్‌తో జిల్లాలో జరిగిన పంటల నష్టం వివరాలను జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు ఈ సందర్భంగా మంత్రికి వివరించారు. మినుము 44,441 ఎకరాలు, పెసలు 32, అలసందలు 17,805, పత్తి 553, వరి 4,344, వేరుశనగ 90 ఎకరాలలో దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా గుర్తించామని, వీటి వివరాలు సేకరిస్తున్నామన్నారు. మంత్రి స్పందిస్తూ ఎన్యుమరేషన్ ప్రక్రియను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. అదే సమయంలో పంటలు దెబ్బతిన్న రైతులెవరూ పరిహారం విషయంలో నష్టపోకుండా ఈ ప్రక్రియలో పారదర్శకత ముఖ్యమని స్పష్టం చేశారు. వ్యవసాయ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నందున అధికారులు ఎలాంటి నిర్లక్ష్యం చూపరాదని మంత్రి స్పష్టం చేశారు. కలెక్టర్ ఏఎస్.దినేష్‌కుమార్ మాట్లాడుతూ రైతులను ఆదుకోవడానికి ఎన్యుమరేషన్, ఈ-క్రాప్ వివరాలే కీలకమని, ఎలాంటి లోపాలు లేకుండా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. తిరిగి సాగు చేయడానికి సబ్సిడీపై అందించే విత్తనాలను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు.



దెబ్బతిన్న పంటను చూస్తున్న కలెక్టర్, మంత్రి నాగార్జున

వ్యవసాయ సలహా కమిటీ ఛైర్మన్ ఆళ్ల రవీంద్రారెడ్డి మాట్లాడుతూ రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వం సేకరించే సమయంలో రైతులకు ఎలాంటి ఆటంకాలు ఎదురు కాకుండా చూడాలని అధికారులను కోరారు. సబ్సిడీపై విత్తనాలు, ఇతర పరిహారం త్వర గా అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు, పంట సాగుదారు హక్కు పత్రం (సి.సి.ఆర్.సి) జారీకి సంబంధించి రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. తొలుత ఫిష్ ఆంధ్ర వాహనాలను మంత్రి, కలెక్టర్ పరిశీలించారు. తుఫాను వల్ల దెబ్బతిన్న పంటల మొక్కలను, వాటికి సంబంధించిన ఫొటోలను కూడా అధికారులు ఈ సందర్భంగా మంత్రికి చూపించారు. సమావేశంలో ఏపిఎంఐపి పీడీ రవీంద్రబాబు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి గోపీచంద్, పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ బేబీరాణి, ఆత్మ పీడీ అన్నపూర్ణ, మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు ఉపేంద్ర కుమార్, జిల్లా మత్స్య శాఖ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, ఎల్‌డిఎం యుగంధర్, నాబార్డ్ డిడిఎం ఎంవి రమణ, మార్క్‌ఫెడ్ డిఎం హరికష్ణ, పిడిసిసి బ్యాంకు ఛైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య, డిఆర్‌డిఏ పీడీ బాబూరావు పాల్గొన్నారు.

ఆర్‌బికెల ద్వారా ధాన్యం కొనాలని

నేడు నిరసన

ఏపీ రైతుసంఘం బాపట్ల జిల్లా అధ్యక్షులు వి.వెంకట్రామయ్య

ప్రజాశక్తి-రేపల్లె

ధాన్యం సేకరించడంలో రైతుల సమస్యలు పరిష్కరించాలని, ఆర్బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు చేయాలని కోరుతూ రేపల్లె అగ్రికల్చర్ ఏడీ కార్యాలయం వద్ద ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 24న నిరసన కార్యక్రమానికి తరలిరావాలని ఏపీ రైతు సంఘం బాపట్ల జిల్లా అధ్యక్షులు వి.వెంకట్రామయ్య శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి సిపిఎం రేపల్లె పట్టణ కార్యదర్శి సిహెచ్.మణిలాల్ మద్దతు తెలిపారు. నాయకులు మాట్లాడుతూ రేపల్లె అగ్రికల్చర్ ఏడి ఆఫీస్ పరిధిలో ఉన్న రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ చేయక పోవడం వల్ల రైతులు దళారులకి తక్కువ ధరకు అమ్ముకొని నష్టపోతున్నారన్నారు. ధాన్యం ప్రభుత్వానికి అమ్మకం చేయాలనుకొంటున్న ఈ ప్రాంతంలో రైతు లకి వస్తున్న సమస్యలు తెలియజేయటం కోసం రైతులు, కౌలురైతులు శనివారం రేపల్లె అగ్రికల్చర్ ఏడీ ఆఫీసు వద్దకు రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం మరియు జిల్లాస్థాయిలో అధికారులు ప్రకటించిన పద్ధతుల్లో ధాన్యం సేకరణ జరగటం లేదని, ఆర్బీకేల ద్వారా ధాన్యం సేకరిస్తున్నామనేది మాటలకే పరిమితమన్నారు. నగరం మండలం పరిధిలో కొంతమేర కొనగోళ్లను ప్రారంభించారని, మిగిలిన మండలాల్లో కనీసం ప్రారంభించలేదని తెలిపారు. రైతులు ఆర్బీకేల వద్దకు ధాన్యాన్ని తీసుకొచ్చి అమ్మటానికి సిద్ధపడుతున్నప్పటికీ ఆర్బీకేలో తేమ శాతాన్ని పరిశీలించి 16 శాతం కంటే ఎక్కువగా ఉందని తిరస్కరిస్తున్నారని పేర్కొన్నారు. ఒక వేళ తేమ 16 శాతం ఉన్నప్ప టికీ దగ్గరలో రైస్‌మిల్లులకైనా తరలించండని.. రైతులు అడుగుతుంటే అది మా చేతుల్లో లేదని, షెడ్యూల్ ప్రకారం కాటా వేసినప్పుడే ఏ మిల్లుకు వెళ్లేదీ తెలుస్తుందని రైతులని గందరగోళంలో పడేస్తున్నారని పేర్కొన్నారు. రైతులు ఆర్బికేల ద్వారా అమ్మకుండా ప్రభుత్వం ప్రకటించిన ▶ 2లో



మాట్లాడుతున్న రైతుసంఘం నాయకులు

రైతులకందే రుణాలు అంతంత మాత్రమే..

(మొదటిపేజీ తరువాయి)

రూ.5,820.06 కోట్లు కేటాయించారు. ఖరీఫ్‌లో ఇప్పటివరకూ రూ.3,290.94 కోట్ల రుణాలు ఇచ్చినట్లు బ్యాంకుల నివేదికలు చెబుతున్నాయి. వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.1,894.65 కోట్లు ఇచ్చారు. రబీలో పంట రుణాలతో పాటు ఇతర వ్యవసాయ అనుబంధ రంగాలకు కలిపి రూ.1600 కోట్లు ఇచ్చారు. అంటే సుమారు రూ.4 వేల కోట్లు పంట రుణాలకు ఇచ్చినట్లు అంచనా. వాస్తవానికి వ్యవసాయానికి రెండు సీజన్లలో కలిపి రూ.15 వేల కోట్లు పెట్టుబడులు అవసరం ఉంటాయని అంచనా. ఇందులో బ్యాంకులు 30 నుంచి 40 శాతం ఇస్తున్నాయి. మిగతావన్నీ ప్రైవేటు రుణాలే.. రుణాల కోసం బ్యాంకుల చుట్టూ తిరిగే పరిస్థితి లేక చాలా మంది రైతులు ఆనవాయితీగా ప్రైవేటు అప్పుల వైపే వెళుతున్నారు. ఇక పంటల వారీగానూ ప్రాధాన్యతలున్నాయి. పొగాకు పంటకు క్రమం తప్పకుండా ఇస్తారు. ఎందుకంటే వసూళ్ల గ్యారంటీ ఉంటుంది. వ్యాపారులు బ్యాంకు గ్యారంటీలు ఇస్తారు. కొన్న పొగాకు తాలూకు డబ్బులు బ్యాంకుల్లోనే జమ చేస్తారు. రుణాలను మినహాయించుకునే రైతులకు మిగిలిన డబ్బులు ఇస్తారు. అందుకే పొగాకు రైతులకు మాత్రం వద్దన్నా రుణాలిస్తారు. కౌలు రైతులైతే ఆశలు వదులుకోవాల్సిందే.. ప్రస్తుతం భారీవర్షాలకు రైతులు నిలువునా మునిగారు. అప్పులు తీర్చేమార్గం లేక రుణాలు రీషెడ్యూల్ కోరుతున్నారు. కొత్తగా అప్పులు కోసం ఎదురుచూస్తున్నారు. పాలకులకు, బ్యాంకులకు మాత్రం వీరి బాధలు పట్టడం లేదు. ఇప్పటికైనా రైతులకు ఇచ్చే రుణాల లక్ష్యాలను పెంచాల్సిన అవసరం ఉంది. అప్పుడే రైతులు ప్రైవేటు అప్పుల బారి నుంచి బయటపడతారు.

నేడు నిరసన

(మొదటిపేజీ తరువాయి)

ధర కంటే తక్కువకి దళారులకు అమ్ముకుంటూ నష్టపోతున్నారన్నారు. జిల్లా కలెక్టర్, ఆర్డీవో, జిల్లాలో ప్రజాప్రతినిధులు తుపాను సందర్భంగా పర్యటించి.. రంగు మారిన ధాన్యాన్ని కూడా కొంటామని చెప్పారని, కానీ రేపల్లె ప్రాంతంలో ఒక గింజ కూడా రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయలేదన్నారు. కనీసం రంగు మారిన ధాన్యం కొనుగోలు చేస్తామని కూడా ఆర్బీకేల లేదా ఇతర అగ్రికల్చర్ అధికారులు కూడా స్పష్టత ఇవ్వటం లేదన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోరుతూ చేపట్టే నిరసన కార్యక్రమానికి రైతులు, కౌలు రైతులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు కె.రమేష్, డి.ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

నేడు పిసిపల్లికి సాయిచంద్

ప్రజాశక్తి-పిసిపల్లి

అమరజీవి పొట్టిశ్రీరాములు పూర్వీకుల స్వగ్రామమైన పిసిపల్లి మండల పరిధిలోని పడమటిపల్లెకు ప్రముఖ హేతువాద కవి త్రిపురనేని రామస్వామి మనుమడు సాయిచంద్ శనివారం మధ్యాహ్నం 3గంటలకు రానున్నట్లు ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షులు చిన్నకొండలరావు ఓ ప్రకటనలో తెలిపారు. పొట్టిశ్రీరాములు ఆశయాల అమలు సాధన కోసం సాయిచంద్ మద్రాసు నుంచి చేపట్టిన పాదయాత్ర పెదఅలవలపాడుకు చేరనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పడమటిపల్లిలోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద సభ నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

మార్చి 31వరకే సాగర్ నీరు

యర్రగొండపాలెం : నాగార్జున సాగర్ కాలువ కింద పంటలు సాగు చేసే రైతులకు 2023 మార్చి 31 వరకే సాగు నీరు వస్తుందని ఎన్ఎస్‌పి త్రిపురాంతకం ఎఇ నీలిమ శుక్రవారం తెలిపారు. రెండో పంటకు నీరు ఇచ్చే అవకాశం లేదన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ విషయాన్ని నాగార్జున సాగర్ ఆయకట్టు పరిధిలోని రైతులు గుర్తించి అందుకు తగినట్లుగా పంటలు సాగు చేసుకోవాలని ఆమె కోరారు.

ప్రభుత్వ కళాశాలలు ఏర్పాటు చేయాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వినోద్

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

నియోజక వర్గ కేంద్రమైన గిద్దలూరులో ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ, పీజీ కళాశాలలు లేక పోవడం దుర్మార్గమని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వినోద్ అన్నారు. స్థానిక సిఐటియు కార్యాల యంలో ఎస్ఎఫ్ఐ సమావేశం జీవన్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ గిద్దలూరు ప్రాంతంలో విద్యా రంగంలో అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వ విద్యా సంస్థలను ఏర్పాటు చేయాలన్నారు. ఐటిఐ, టిటిసి, బిఇడి తరగతులు రోజు నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. డిగ్రీ విద్యార్థులకు నిర్వహిస్తున్న ఇంటర్న్‌షిప్‌లో తలెత్తే సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో లక్ష్మీకాంత్, రవికుమార్, ఈశ్వర్‌రెడ్డి, రియాజ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వినోద్

మాజీ ఎమ్మెల్యే విజయకుమార్‌రెడ్డికి నివాళి

ప్రజాశక్తి - గిద్దలూరు

ప్రజా నాయకుడిగా, విద్యాభివద్ధి కృషివలునిగా గిద్దలూరు జన హదయాల్లో నిలిచిన వ్యక్తి దివంగత నేత, మాజీ ఎమ్మెల్యే పిడతల విజయ కుమార్ రెడ్డి అని మాజీ ఎమ్మెల్యే పిడతల సాయి కల్పనా రెడ్డి తెలిపారు. మాజీ ఎమ్మెల్యే, దివంగత పిడతల విజయకుమార్‌రెడ్డి 22వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఘన నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో వియకుమార్‌రెడ్డి కుమారుడు పిడతల అభిషేక్ రెడ్డి, రమణారెడ్డి, దేవ ప్రభాకర్, శివారెడ్డి, గొంగటి వెంకట శ్రీధర్, షఫీ, రవి కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే సాయి కల్పనా రెడ్డి

టిడిపి రాష్ట్ర క్రిస్టియన్ సెల్

కార్యనిర్వాహక కార్యదర్శిగా జాన్సన్

ప్రజాశక్తి-కనిగిరి

టిడిపి రాష్ట్ర క్రిస్టియన్ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శిగా కనిగిరి పట్టణానికి చెందిన తాతపూడి జాన్సన్ నియమితులయ్యాడు. ఈ మేరకు టిడిపి కనిగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి శుక్రవారం జాన్సన్‌కు నియామక పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా జాన్సన్ తనకు పదవి వచ్చేందుకు కారణమైన డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి, టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు,కార్యదర్శి నారా లోకేష్‌లకు కృతజ్ఞతలు తెలియజశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రాచమళ్ల శ్రీనివాసరెడ్డి, తమ్మినేని శ్రీనివాసరెడ్డి, షేక్ ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.



జాన్సన్‌ను అభినందిస్తున్న డాక్టర్ ఉగ్ర

బహుమతులు ప్రదానం

పిసిపల్లి : రామానుజన్ జయంతి సందర్భంగా విద్యార్థులకు గురువారం వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు విద్యాకమిటీ చైర్మన్ యు. కొండలరావు చేతుల మీదుగా శుక్రవారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అల రించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కనపర్తి మాల్యాద్రి, ఉపాధ్యాయులు బి. వేమానారాయణ, కె.జ్యోష్ణ, ఎం. రఘుకుమార్, ఐఎల్ఎం. నంసింహారావు, కె.కృష్ణచైతన్య తదితరులు పాల్గొన్నారు.

రాజుపాలెంలో 'ఇదేమి ఖర్మ'

ప్రజాశక్తి-పొదిలి

ప్రజలపై భారాలు మోపుతున్న నియంత్ర ప్రభుత్వం పోవాలని మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తెలిపారు. పొదిలి నగర పంచాయతీ పరిధిలోని రాజుపాలెం గ్రామంలో ఇదేం ఖర్మ మన రాష్టానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కందుల నారాయణరెడ్డి ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. అనంతరం కందుల మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై అధిక భారాలు మోపుతున్నట్లు విమర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నూతలపాడులో అన్నదానం చేస్తున్న దాతలు

వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి-పర్చూరు: వెంకట్ మహేశ్వర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కనమర్లపూడి వెంకటరత్నం, వెంకటకోటేశ్వరరావు, బుడ్డి, నేరేళ్ల లక్ష్మీశారద జ్ఞాపకార్థం సాయిరాం స్టీల్స్ ఐరన్, విజయవాడ వారి సహకారంతో శుక్రవారం నూతలపాడులో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆశ్రమంలోని 24 మందికి అన్నదానం చేసి పండ్లు అందజేశామని నిర్వాహకుడు రామకృష్ణ వివరించారు.

కామేపల్లిలో 'గడప గడపకూ మన ప్రభుత్వం'

ప్రజాశక్తి-సంతమాగులూరు

జగనన్న పాలనలో ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని రాష్ట్ర శాప్ నెట్ చైర్మన్, వైసిపి అద్దంకి నియోజకవర్గ కన్వీనర్ బాచిన కృష్ణ చైతన్య అన్నారు. శుక్రవారం మండలంలోని కామేపల్లి గ్రామంలో నాలుగో రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఎస్సీ కాలనీలో గడప గడపకూ వెళ్లి ఆయా కుటుంబాల యోగక్షేమాలని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్ల పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రంలో పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ఎన్నికల ముందు చెప్పిన దానికన్నా ఎక్కువగా పని చేశారన్నారు. రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలు అమలుపరుస్తూ పరిపాలన చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వెల్లలచెరువు సొసైటీ అధ్యక్షులు చింతా శ్రీధర్, మండల వైసిపి పార్టీ అధ్యక్షులు చింతా రామారావు, జడ్పిటిసి అడవి శ్రీనివాసరావు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు సన్నెబోయిన గురు యాదవ్, ఎంపిటిసి మోదేపల్లి శ్రీనివాసరావు, గుండపునేని సుబ్బారావు, ఓరుగంటి కోటిరెడ్డి, ముసలారెడ్డి, పలువురు సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.



'గడప గడపకూ'లో పాల్గొన్న బాచిన కృష్ణ చైతన్య

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-సంతమాగులూరు

మండలంలోని ఏల్చూరు గ్రామంలో, అద్దంకి, నార్కెట్ పల్లి రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. కనిగిరి ప్రాంతంలోని పందుల నాగులవరం గ్రామానికి చెందిన తాతపూడి నతానియేలు(25) హైదరాబాదు నుంచి మోటార్ సైకిల్‌పై తన స్వగ్రామం వస్తున్నాడు. ఏల్చూరు వద్ద రహదారి మలుపులో, ఒంగోలు నుంచి హైదరాబాద్ వైపు ఎడమవైపు వెళ్లవలసిన కారు కుడివైపునకు దూసుకువచ్చి మోటార్ సైకిల్‌పై ఉన్న నతానియేలును ఢీకొట్టింది. దీంతో నతానియేలుకు తీవ్ర గాయాలయి స్పృహ కోల్పోయి రహదారిపై పడిపోయాడు. ఢీ కొట్టిన కారు రోడ్డు మార్జిన్‌లోకి వెళ్లింది. కారులో ఉన్న నలుగురికీ ఎలాంటి గాయాలు కాలేదు. తీవ్ర గాయాలయిన నతానియేలును టోల్ గేట్ అంబులెన్స్ ద్వారా నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ నాగశివారెడ్డి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



గాయపడిన యువకుడు



నేలకొరిగిన విద్యుత్ స్తంభం

వాహనం ఢీకొని కూలిన విద్యుత్ స్తంభాలు

ప్రజాశక్తి-పెద్దారవీడు

గుర్తు తెలియని వాహనం విద్యుత్ స్తంభాలను ఢీకొనడంతో అవి నేలకూలాయి. ఈ సంఘటన పెద్దారవీడు మండలం సానికవరం సమీపంలోని ఆశ్రమం వద్ద శుక్రవారం జరిగింది. విషయాన్ని తెలుసుకున్న విద్యుత్ శాఖ సిబ్బంది తీగలను తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. విద్యుత్ స్తంభాలు కిందపడడంతోపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పెనుప్రమాదం తప్పింది. దీంతో ట్రాఫిక్ భారీగా నిలిచిపోయింది.

ఇంకొల్లు-పర్చూరు రోడ్డు పనులు ప్రారంభిస్తాం

ఆర్అండ్‌బి బాపట్ల జిల్లా ఈఈ వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

పర్చూరు-ఇంకొల్లు రోడ్డు నిర్మాణ పనులను మరో 10 రోజుల్లో ప్రారంభిస్తామని బాపట్ల జిల్లా ఆర్అండ్‌బి ఇఇ వి శ్రీనివాసరావు వెల్లడించారు. పర్చూరు-ఇంకొల్లు రోడ్డును శుక్రవారం ఆయన పరిశీలించారు. ఇంకొల్లులో వై జంక్షన్ నుంచి సినిమాహాలు సెంటర్ బొమ్మల సెంటర్ వరకు 10 మీటర్లతో సిసి రోడ్డు, పర్చూరు వరకు 7 మీటర్ల తారురోడ్డు రు. 22 కోట్లు మంజూరయ్యాయన్నారు. పనుల ప్రారంభానికి ఉన్న ఆటంకాలు తొలిగాయని త్వరలో కాంట్రాక్టర్ పనులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. పది రోజుల్లో పనులు ప్రారంభించి పూర్తి చేస్తామని ఇఇ హామీ ఇచ్చారు. ఆయన వెంట పర్చూరు డిఇ ఎం నరశింహులు, ఇంకొల్లు జెఇ జి నాగార్జున, సిబ్బంది ఉన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి: ఎమ్మెల్యే కరణం

ప్రజాశక్తి-చీరాల

ప్రజలందరూ సంక్షేమ పథకాలను సద్వినయోగం చేసుకోవాలని, రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల ప్రజలందరికీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేయూతనందిస్తున్నారని శాసనసభ్యులు కరణం బలరామకృష్ణమూర్తి అన్నారు. ఇండస్ట్రియల్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో జగనన్న బడుగు వికాసం కింద మూడు ఆటోలు, కారును ఎమ్మెల్యే చేతుల మీదుగా పట్టణంలో శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కరణం మాట్లాడుతూ ఈ స్కీమ్ కేవలం ఎస్సీ ఎస్టీలకు మాత్రమే వర్తిస్తుందని, తీసుకున్న వాహనాలకు 45 శాతం సబ్సిడీ ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ ఛైర్మన్ బోనీగల జైసన్ బాబు, ఇండస్ట్రియల్ డిపార్టుమెంట్ ప్రతినిధి ఎన్ మదన్ మోహన్ శెట్టి, ఎండీవో నేతాజీ, కమిషనర్ ఐసయ్యా, ఏపీఎం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఉరివేసుకొని వివాహిత బలవన్మరణం

ప్రజాశక్తి-వేటపాలెం



ఉరేసుకున్న మహిళ

భర్త అనురాగం, ఆప్యాయతతో జీవితాంతం తోడునీడగా ఉంటాడని కలలు కన్న ఆ యువతి కలలన్నీ కల్లలయ్యాయి. తన జీవితం వ్యర్థమని తలచి బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన మండల పరిధిలోని వేటపాలెం పద్మశాలివారి వీధిలో శుక్రవారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పరాల అనూష(26) ఎప్పటి మాదిరిగానే ఇల్లు చక్కదిద్దుకొని తన ఇద్దరు పిల్లలకు, భర్త అమరలింగేశ్వరరావులకు ఉదయాన్నే టిఫిన్ వండి పెట్టింది. భర్త అల్పహారం చేసి మార్బుల్ పనికి వెళ్లారు. భర్త పనికి వెళ్లినట్లు నిర్ధారించుకున్నాక తన ఇద్దరు పిల్లలు చూస్తుండగానే సీలింగ్ ఫ్యాన్‌కి కమ్మీకి చీరతో ఉరి వేసుకొంది. ఏంజరుగుతుందో తెలియని ఆమె ఆరేళ్ల కుమారుడు తన పెద్దమ్మ ఇంటికి వెళ్లి ఆమెను వెంటబెట్టుకొని తన ఇంటికి తీసుకొని వెళ్లాడు. ఊహించని ఈ పరిణామానికి కుటుంబ సభ్యులు గుండెలు బాదుకున్నారు. సమాచారం అందుకున్న వేటపాలెం ఎస్ఐ జి సురేష్ హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకొని మృతదేహాన్ని కిందకు దించారు. పొన్నూరుకు చెందిన ఆమె తల్లిదండ్రులకు సమాచారం అందించారు. తల్లిదండ్రులు వచ్చిన తరువాత పోలీసులు పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఉరివేసుకున్నాక కుటుంబ సభ్యులు, పోలీసులు వచ్చేదాకా బాడీని కిందకు దించకపోవడం, చుట్టుపక్కల జనాలు ఎలాంటి సమాధానాలు చెప్పకపోవడం పట్ల పలు అనుమానాలు తలెత్తున్నాయి. వేటపాలెం ఎస్ఐ జి సురేష్ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు తెలిపారు.

జీవన నైపుణ్యాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-ఒంగోలు



అవగాహన కల్పిస్తున్న డైరెక్టర్ పుష్పేశ్వరి

చిన్నారులకు చదువుతో పాటు జీవన నైపుణ్యాలపై అవగాహన అవసరమని ఫ్రీడమ్‌బర్డ్స్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ పుష్పేశ్వరి తెలిపారు. శుక్రవారం రైతు దినోత్సవం సందర్భంగా స్థానిక లాయరుపేటలోని ఫ్రీడమ్‌బర్డ్స్‌లో విద్యార్థులకు, తల్లిదండ్రులకు పట్టణ వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు మాట్లాడుతూ రైతులు వ్యవసాయం ఏ విధంగా చేస్తారో చిన్నారులకు వివరించారు. రోజూ పది నిమిషాలైనా చిన్నారులు మొక్కల పెంపకంపై దృష్టి పెట్టేలా చూడాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ సందర్భంగా రైతు వేషధారణలో చిన్నారులను అలరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ ఆంజనేయులు

రోడ్డు ప్రమాదంలో ఒడిశా వాసి మృతి

ప్రజాశక్తి-చీమకుర్తి

గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో ఒడిశాకు చెందిన గగన్ బిహారీ ప్రధాన్(46) మృతి చెందాడు. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం గగన్ విహారీ కుటుంబ సభ్యులు గత 12 ఏళ్ల క్రితం గ్రానైట్ పనుల నిమిత్తం చీమకుర్తి ప్రాంతానికి వచ్చి స్థిరపడ్డారు. టీ కొట్టు పెట్టుకొని జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం వేకువజామున 4.20 నిమిషాల సమయంలో ఆటోలో ఒంగోలు నుంచి వస్తుండగా, స్థానిక రామ్‌నగర్ బైపాస్ జంక్షన్‌లోకి వచ్చేసరికి వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. ప్రమాదంలో గగన్ బిహారీ ప్రధాన్‌కు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలో ఉన్న ఒరిస్సా రాష్ట్రానికి చెందిన తిరుమల నాగరాజు, ప్రయాణికులు కొనకు బెహ్రా, బినోద్ బెహర్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానిక ఎస్ఐ వి ఆంజనేయులు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతులు సేంద్రీయ ఎరువుల వైపు మొగ్గు చూపాలి

ప్రజాశక్తి-పర్చూరు

రైతులు సేంద్రీయ ఎరువుల వైపు మొగ్గు చూపాలని లాం శాస్త్రవేత్త సుబ్బారావు పేర్కొన్నారు. జాతీయ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకొని పర్చూరు అద్దంకి నాంచారమ్మ కళ్యాణ మండపంలో రైతు సహాయ వేదికను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త సుబ్బారావు మాట్లాడుతూ ఎరువులు, పురుగుమందులు విచక్షణా రహితంగా వాడటం మంచిదికాదని అన్నారు. దీనివల్ల పంట ఉత్పత్తుల నాణ్యత దెబ్బతింటుందన్నారు. కావాల్సిన మోతాదులో ఎరువులు, పురుగు మందులు వాడుకోవాలని శాస్త్రవేత్త రమేష్ సూచించారు. నేలలో తేమశాతం ఎక్కువగా ఉన్నందున తెగుళ్ల సమస్య అధికమవుతుందని, ఎప్పటికప్పుడు పైర్లను పరిశీలించుకుంటూ అవసరమైన సస్యరక్షణ చర్యలు చేపట్టటం మంచిదని అన్నారు. సదస్సులో తహశీల్దారు నెహ్రూబాబు, ఏడిఏ మోహన్‌రావు, ఏఓ ఎస్ రామ్మోహన్‌రెడ్డి, జాతీయ ఉత్తమ రైతు గ్రహీత సురేష్, రైతులు పాల్గొన్నారు.

దేశానికి అన్నం పెట్టేది రైతులే..

ప్రజాశక్తి-చెరుకుపల్లి

దేశానికి రక్షణ కల్పించేది జవాన్లు అయితే దేశానికి జవాన్లకు కూడా కడుపు నింపేది రైతులని, వారిని గుర్తుంచుకోవడం కోసం ఏర్పాటుచేసిన రైతు దినోత్సవం నాడు రైతులను సన్మానించడం అభినందనీయమని జనసేన పార్టీ జిల్లా కన్వీనర్ మత్తి భాస్కరరావు అన్నారు. జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని తూర్పుపాలెం పంచాయతీలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో రైతులను కౌలు రైతులను కలిసి వారి కష్టాలను తెలుసుకొని సన్మానించారు. రైతుల సమస్యలు పరిష్కరించడంలో జనసేన పార్టీ నాయకుడు పవన్ కళ్యాణ్ ముందు ఉంటారని అందుకొరకే ఇటీవల కౌలు రైతులకు నష్టపరిహారాన్ని చెల్లించాలని అన్నారు. రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికి ఉందని ఈ సందర్భంగా నాయకులు కొనియాడారు. ఉదయ్ అందే సాంబశివరావు, మత్తి యానాదిరావు, డైసన్ తదితరులు పాల్గొన్నారు.



రైతులను సన్మానిస్తున్న నాయకులు

సంతూర్ స్కాలర్‌షిప్‌కు ముగ్గురు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-చీరాల

సంతూర్ ఉమెన్స్ స్కాలర్‌షిప్‌నకు చీరాల ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ పి రవికుమార్ మాట్లాడుతూ ముగ్గురు విద్యార్థులు స్కాలర్‌షిప్‌నకు ఎంపిక కావటం హర్షణీయమన్నారు. ఎంపికైన ఒక్కొక్క విద్యార్థికి సంవత్సరానికి రూ.24,000 చొప్పున నాలుగు సంవత్సరాలలో రూ.96,000 వస్తుందని చెప్పారు. స్కాలర్‌షిప్‌నకు ఎంపికైన బిటెక్ ఫస్ట్ ఇయర్ సిఎస్సి స్టూడెంట్లు డి సుభాషిని, జే వెన్నెల, జి లావణ్యను అధ్యాపకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో స్కాలర్‌షిప్ కోఆర్డినేటర్ బి కోటేశ్వరరావు, సూర్యనారాయణ పాల్గొన్నారు.



విద్యార్థినులకు స్కాలర్‌షిప్ పంపిణీ చేస్తున్న ప్రిన్సిపల్ రవి

'గురుకులం' ఘటనపై సమగ్ర విచారణ చేయాలి

అలసత్వంతో ఉన్న ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి ● లైంగిక దాడికి పాల్పడిన పిఈటిపై కేసు నమోదు చేయాలి: ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి-పర్చూరు

పర్చూరు ఎస్‌టి గురుకులంలో విద్యార్థులు గంజాయి తాగి కొట్టుకుంటున్నారన్న వీడియో రాష్ట్రవ్యాప్తంగా వైరల్ అయిన నేపథ్యంలో గురుకులానికి వెళ్లి విచారణ చేస్తున్న అధికారులు సమగ్రంగా విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ బాపట్ల జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పీ మనోజ్ కుమార్, బి ఆర్య డిమాండ్ చేశారు. వారు సదరు గురుకులాన్ని సందర్శించి ప్రిన్సిపల్, విద్యార్థులతో మాట్లాడారు. గురుకులంలో కొద్దిమంది టీచర్లు విధులను నిర్వహించకుండా విద్యార్థులకు క్లాసులు చెప్పకుండా నిర్లక్ష్యంగా ఉన్నారని, వీటిని సరిచేయాల్సిన ప్రిన్సిపల్ ఉదాసీనంగా ఉండడం, నైట్ వాచ్‌మెన్ విధుల పట్ల అలసత్వంగా ఉండడం, పై అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల పర్చూరు గురుకులం ఈ ఘటనలకు నిలయంగా మారిందని వారు విశ్లేషించారు. గురుకులంలో పిఈటి బానోతు చంద్రబాబు నాయక్ విద్యార్థులపై లైంగిక దాడికి పాల్పడుతున్నాడని నవంబర్ మూడో తేదీన ఒంగోలు బాలల సంక్షేమ కమిటీ విచారణ చేసి జిల్లా అధికారులకు నివేదిక ఇచ్చినా అతని మీద చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా ఉండటం సమంజసం కాదని పేర్కొన్నారు.



హాస్టల్ వార్డెన్ వెంకటస్వామితో మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

విద్యార్థుల ఇంటికి ఫోన్ చేసి మాట్లాడుతున్న సమయంలో మహిళలతో అసభ్యంగా మాట్లాడేవాడన్నారు. ఈ విషయంపై తల్లిదండ్రులు ఫిర్యాదు చేసినా పిఈటి మీద చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. అదేవిధంగా టీచర్ల మధ్య వ్యక్తిగత వివాదాలు ఉన్న నేపథ్యంలో వాటి ప్రభావం అక్కడ విద్యార్థుల చదువుపై కూడా ఉన్నదని పేర్కొన్నారు. హిందీ టీచర్ పాఠాలు చెప్పకుండా ఆఫీసుకే పరిమితం అవుతున్నాడన్నారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్‌కు విద్యార్థులు చెప్పినా తన విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారని పేర్కొన్నారు. గురుకులం ప్రిన్సిపల్ తమను కులం పేరుతో వేధిస్తున్నాడంటూ అక్కడి టీచర్లు ఎస్సీ కమిషన్‌కి లేఖ రాశారన్నారు. ఈ విషయాలపై సంబంధిత జిల్లా అధికారులు చర్యలు చేపట్టడంలో నిర్లక్ష్యంగా ఉన్నారన్నారు. లైంగిక దాడి విషయంలో బాలల హక్కుల కమిటీ నివేదిక ప్రకారం జిల్లా గిరిజన అధికారి పిఈటికీ సమాధానాలు ఇవ్వమని నోటీసు ఇచ్చిన నేపథ్యంలో పుట్టినరోజు వేడుకల సందర్భంగా గురుకులం విద్యార్థి అక్కడ స్టాఫ్ సహకారంతో మద్యం సేవించి కొట్టుకుంటున్న గత సంవత్సరం తీసిన వీడియోను సోషల్ మీడియా ద్వారా వైరల్ చేశారు. ఈ విషయాలను చర్చకు రాకుండా చేసి అక్కడ గంజాయి తాగుతున్నారంటూ విద్యార్థులను బలి పశువులు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, కాబట్టి పూర్తి స్థాయిలో ఒక కమిటీ వేసి విచారణ చేసి ఈ ఘటనకు బాధ్యులపైన చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా పాఠశాలల్లో విద్యార్థులకు క్లాసులు పూర్తి స్థాయిలో జరిగే విధంగా పాఠ్యాంశాలు బోధించడానికి అవసరమైన టీచర్లను కూడా నియమించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకులు నాగలక్ష్మి, కుమార్ పాల్గొన్నారు.



స్టడీ మెటీరియల్ అందిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రతిభా అన్వేషణ పరీక్షకు సిద్ధం కావాలి

ప్రజాశక్తి-కర్లపాలెం

జాతీయ ప్రతిభా అన్వేషణ పరీక్షకు విద్యార్థులు సిద్ధపడాలని కర్లపాలెం యూటీఎఫ్ శాఖ ప్రధాన కార్యదర్శి ఎండి అక్రమ్ ఘోరీ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు జాతీయ ఉపకార వేతన పరీక్షకు సంబంధించిన మెటీరియల్‌ను అందించారు. ఈ కార్యక్రమానికి మండల యుటిఎఫ్ సమాచార ప్రతినిధి ఈ పోలీస్‌రావ్ అధ్యక్షత వహించగా ఘోరీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఈ మెటీరియల్‌ను ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు సహకారంతో అందిస్తున్నామన్నారు. ఈ పరీక్షలో ఎంపికైన వారికి 8వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఉపకార వేతనాలు అందుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉదయ్, ఫ్రాన్సిస్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



ఇంకొల్లులో భిక్షాటన చేస్తున్న పంచాయతీ కార్మికులు

ఇంకొల్లులో పంచాయతీ కార్మికుల భిక్షాటన

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

గత 5 నెలలుగా జీతాలు చెల్లించాలని ఇంకొల్లులో గ్రామ పంచాయతీ కార్మికులు చేస్తున్న రిలే నిరాహారదీక్ష శుక్రవారం 3వ రోజుకు చేరింది. తెలుగుదేశం పార్టీ నాయకులు రిలే నిరాహార దీక్షలో కూర్చొని కార్మికులకు మద్దతు ప్రకటించారు. ప్రతి నెలా జీతాలు కార్మికులకు ఇవ్వాలని, వేతనాలు పెంచాలని తెలుగుదేశం పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం గ్రామ పుర వీధుల్లో కార్మికులు భిక్షాటన చేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు వీరగంధం ఆంజనేయులు, పాలేరు రామకృష్ణ, షేక్ రఫీ, వలేరు మార్కు, పి హనుమయ్య, కె రాంబాబు, శ్రీనివాసరావు, కిషోర్, వెంకటేశ్వర్లు, శివయ్య, సిఐటియు నాయకులు జి ప్రతాప్‌కుమార్, నాగండ్ల వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



మిత్రుడి కుటుంబానికి పోస్టల్ డిపాజిట్ బుక్ అందజేస్తున్న స్నేహితులు

మిత్రుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-వేటపాలెం

తమతో కలిసి బండ్ల బాపయ్య హిందూ జూనియర్ కళాశాలలో చదువుకున్న స్నేహితుని కుటుంబానికి 1998 ఎస్-ఎస్‌సి బ్యాచ్ విద్యార్థులు లక్ష రూపాయల ఆర్థిక సాయం శుక్రవారం అందించారు. ఇటీవల క్యాన్సర్‌తో బాధపడుతూ తమ మిత్రుడు దారా జెస్సి కుమార్(38) మరణించాడు. అతని భార్య శిరీష, పిల్లలు ధనుష్, జెస్సికల పేరున లక్ష రూపాయలు పోస్టల్ డిపాజిట్ చేసి సంబంధిత పుస్తకాన్ని అందించారు. తమ ఆత్మీయ స్నేహితునికి ఘన నివాళులు అర్పించారు. భవిష్యత్తులో ఏమైనా ఆర్థిక ఇబ్బందులు ఉంటే తమకు తెలియపరచాలని భరోసా కల్పించారు. స్నేహితుని కుటుంబానికి చేదోడువాదోడుగా నిలిచి అందరికీ ఆదర్శప్రాయులుగా నిలిచారు. ఈ కార్యక్రమంలో వీరన్న, రబ్బాని, సురేష్, కరీమ్, రత్నం, రవి, జయరాజు, లక్ష్మణ్, అయ్యప్ప, హనుమాచారి, సుధాపాణి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఖోఖో పోటీలకు బాలుర జట్టు..

ప్రజాశక్తి-పంగులూరు

ఈనెల 25వ తేదీ నుంచి 30వ తేదీ వరకు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని, బన్సబరి పట్టణంలో జరుగనున్న 41వ, జాతీయ స్థాయి బాలురు, బాలికల ఖోఖో పోటీలలో పాల్గొనేందుకు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలుర జట్టు, శుక్రవారం బయలుదేరి వెళ్లింది. ఈ జట్టుకు ఈనెల 14వ తేదీ నుంచి 23వ తేదీ వరకు, పంగులూరులోని మా గుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలో శిక్షణ కార్యక్రమం జరిగింది. జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనేందుకు వెళుతున్న జట్టులోని క్రీడాకారులకు, ఆంధ్ర ఖోఖో అసోసియేషన్ తరపున మేకల సీతారామరెడ్డి క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. క్రీడాకారుల శిక్షణ, ముగింపు సభలో స్థానిక కళాశాల ప్రిన్సిపాల్ రమేష్‌బాబు, రాష్ట్ర ఖోఖో కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి, మేనేజర్ జి నాగ వెంకట శివ, కోచ్‌లుగా పోతిరెడ్డి శివారెడ్డి (ఇండియన్ పోస్టల్), కె శ్రీనివాసరావు (ఇండియన్ రైల్వే) వ్యవహరిస్తారని సీతారామరెడ్డి తెలిపారు. ఈ బాలుర జట్టు జాతీయ స్థాయి క్రీడలో విజయం సాధించాలని జిల్లా ఖోఖో కార్యదర్శి బి కాశీ విశ్వనాథరెడ్డి, పంగులూరు గ్రామ పెద్దలు ఆశీస్సులు అందజేశారు.



ఖోఖో పోటీలకు సిద్ధమైన రాష్ట్ర బాలుర జట్టు

ఖోఖో రాష్ట్ర బాలుర జట్టు

జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ప్రకాశం జిల్లాకు చెందిన ఆర్ సూరి నాయుడు, కె మహేష్, కే మంత్రు నాయక్, జి లక్ష్మి జీవన్ కుమార్, ఎస్ షాలేం రాజు, వై సుధీర్, విశాఖపట్నం జిల్లాకు చెందిన కె దుర్గాప్రసాద్, కే మణికంఠ, సిహెచ్ ప్రసాద్, కర్నూలు జిల్లాకు చెందిన బి భరత్ నాయక్, ఎస్ రమేష్, శ్రీకాకుళం జిల్లాకు చెందిన డి దిలీప్, గుంటూరు జిల్లాకు చెందిన పి రవి, పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ఎన్ అభినవ్, నర్సారెడ్డి, విజయనగరం జిల్లాకు చెందిన సాయి.

జాతీయ రహదారి పనులు వేగవంతం చేయండి: జేసీ

ప్రజాశక్తి-పర్చూరు

వాడరేవు-పిడుగురాళ్ల జాతీయ రహదారికి కావాల్సిన భూసేకరణ సర్వే పనులు వెంటనే పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. పర్చూరు సమీపంలోని వై జంక్షన్ వద్ద సర్వే వివరాలను పరిశీలించారు. రోడ్డు నిర్మాణానికి సంబంధిం చిన వివరాలను తహశీల్దారు నెహ్రూబాబు, సర్వేయర్ సురేష్‌బాబులను అడిగి తెలుసు కున్నారు. సర్వే పనులు ఆలస్యం అవుతుండటంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తు ఎప్పటిలోగా పూర్తి చేస్తారని ప్రశ్నించారు. ఒకే రోవర్ సర్వే చేసేందుకు ఉండటంతో పనులు ఆలస్యమవుతున్నాయని జెసికి వివరించారు. ఎన్ని రోవర్లు కావాలో చెబితే సిద్ధం చేస్తామని, సర్వే త్వరగా జరగాలని శ్రీనివాసులు ఆదేశించారు. రెవెన్యూ ఉద్యోగులు, జాతీయ రహదారి సంస్థ సిబ్బంది సమన్వయంతో పనిచేసి వీలైనంత త్వరగా భూసర్వేకు సంబంధించిన వివరాలు అందజేయాలని ఆదేశించారు. సర్వేకు చెందిన డిఐని పర్యవేక్షణకు పంపుతామన్నారు. వై జంక్షన్ వద్ద ప్రస్తుతం రోడ్డుకు దూరంగా ఉండేలా అలైన్‌మెంట్ ఉందని, దీని వలన తమ మంచి భూమిని కోల్పోతామని రైతులు జెసి దృష్టికి తీసుకువచ్చారు. అలైన్‌మెంట్ రూపొందించేది జాతీయ రహదారుల సంస్థ పరిధిలోనిదని, తమ పరిధిలోకి మార్చే వెసులుబాటు ఏమీ లేదని పేర్కొన్నారు. పరిహారం విషయంలో వీలైనంత ఎక్కువగా వచ్చేలా ప్రయత్నిస్తామన్నారు. గతంలో 60 మీటర్లుగా పేర్కొని ప్రస్తుతం 40 మీటర్లుగా మార్కింగ్ ఇవ్వటం ఏమిటని జాతీయ రహదారి సంస్థ ఏఇఇ ఖాదర్ నవాజ్‌ను జెసి ప్రశ్నించారు. ఉన్నతాధికారులు రూపొందించిన అలైన్‌మెంట్ ప్రకారమే ప్రస్తుతం పనులు చేస్తున్నట్లు ఏఇఇ వివరించారు. వారం రోజుల్లో సర్వే పనులు పూర్తి చేయాలని జెసి ఆదేశించారు.



పర్చూరులో మ్యాప్‌ను పరిశీలిస్తున్న జెసి శ్రీనివాసులు

తానా సేవలు అభినందనీయం: మంత్రి

ప్రజాశక్తి-రేపల్లె

తానా ఫౌండేషన్, తానా చైతన్య స్రవంతి, గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. పలువురు దాతల సహకారంతో మెడికల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గన్నే మల్లికార్జునరావు సామ్రాజ్యంల జ్ఞాపకార్థం పట్టణంలోని గుత్తికొండ లక్ష్మీనారాయణ కళ్యాణ మండపం, వీరవల్లి కోటయ్య హాల్‌లో శుక్రవారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ తీర ప్రాంత ప్రజల అవసరాలకు అనుగుణంగా క్యాన్సర్, గుండె జబ్బులు, షుగర్, ఆర్థోపెడిక్, న్యూరాలజీ, గాస్ట్రో, చెవి ముక్కు గొంతు మరియు ఇతర వైద్య నిపుణును తీసుకువచ్చి పేదలకు ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమని అన్నారు. ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ సమాజ సేవకు తానా వారు చేస్తూన్న సేవలు విస్తతం కావాలని అన్నారు. అనంతరం ప్రతిభా వంతులైన విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు దంత వైద్య శిబిరాలు నిర్వహించారు. అదేవిధంగా 2వ వార్డులోని గురుకుల పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు నిష్ణాతులచే కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించి అవగాహన కల్పించారు. పలు డిగ్రీ కళాశాలల్లో విద్యార్థినులకు కాన్సర్ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. పలు పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, డిబేట్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. పేద విద్యార్థులకు సైకిళ్లు, నిరుపేదలకు రగ్గులు, దుప్పట్లు పంపిణీ చేశారు. శిబిరంలో 2200 వరకు ఓపి వచ్చినట్లు డాక్టర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున, ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్, మాజీ ఎమ్మెల్యే దేవినేని మల్లికార్జునరావు, మున్సిపల్ చైర్మన్ కట్టా మంగ, వైస్‌చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, ఎంసీఏ మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ వేజళ్ల ప్రకాశరావు, కార్యదర్శి జీ బాపారావు, లక్ష్మీనారాయణ, సుబ్బారావు, రమేష్, ప్రసాద్, ప్రభల సుబ్రహ్మణ్యం, సాయిప్రసాద్, సత్యప్రసాద్, కొత్తమాసు మహేష్, సుగ్గల సుదర్శన్, తానా కన్వీనర్ పోట్లూరి రవి, తానా చైతన్య స్రవంతి కన్వీనర్ పి సునీల్, సభ్యులు పెద్దిబోయిన జోగేశ్వరరావు, గన్నె వెంకట రమణ, దారపాటి వేణు, కొత్తపల్లి అంజనేదేవి, దివ్య తదితరులు పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

నగరంలోని గుత్తికొండవారిపాలెం పోతురాజు కాలువ వద్ద నిర్మిస్తున్న సీవెజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను కలెక్టర్ దినేష్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెకట్ర్ ప్లాంట్ మొత్తం పరిశీలించి వివరాలు అడిగితెలుసుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం, నగరపాలక సంస్థ వాటా ధనం రూ.30.97 కోట్లు వెచ్చించి ప్లాంట్ నిర్మాణం చేస్తున్నట్లు నగరపాలక, పబ్లిక్ హెల్త్ అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు.. ఈప్లాంట్ వినియోగంలోకి వస్తే పోతురాజు కాలువ ద్వారా ప్రతిరోజు సముద్రంలో కలుస్తున్న 15 మిలియన్ లీటర్ల నీటిని శుద్ధి చేయవచ్చునని తెలిపారు. తద్వారా సముద్రంలో కలిసే మురుగునీరు వల్ల చేపలు, మొక్కలు దెబ్బతినవని వివరించారు. శుద్ధిచేసిన మురుగు నీటిని మొక్కలు పెంపకానికి, పంటల పెంపకానికి వినియోగించవచ్చని తెలిపారు. మురుగునీటిలో నుంచి



సీవెజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

వచ్చే కొన్ని వ్యర్థపదార్థాలను ప్లాంటు నుంచి వేరు చేసి తిరిగి వినియోగంలోకి తీసుకు రావచ్చని వివరించారు. సెప్టిక్ ట్యాంకు వ్యర్థాలను కూడా ఈ ప్లాంటు ద్వారా శుద్ధిచేయవచ్చని తెలిపారు. జాతీయ పర్యావరణ సంస్థ నిబంధనల మేరకు ఈ ప్లాంటు నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ట్రైయల్ రన్ కూడా పూర్తిచేశామని, త్వరలో ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నమని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేసి ప్లాంట్‌ను త్వరగా వినియోగంలోకి తీసుకు రావాలని సూచించారు. అనంతరం పేర్నమిట్ట సమీపంలోని పీర్లమాన్యంలో రూ.1.20 కోట్లు వ్యయంతో నిర్మాణంలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్ భవనాన్ని కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణ పనుల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్ వెంట నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, పబ్లిక్ హెల్త్ ఇఇ జానీ, జెఇ మనోహర్, కార్పొరేషన్ ఇంజినీర్ కె మాల్యాద్రి, డిఇఇ గణపతి, ఎఇ అంజిరెడ్డి, కార్పొరేటర్ గోలి లక్ష్మీ కోటేశ్వరమ్మ, వైసిపి నాయకులు గోలి తిరుపతిరావు తదితరులు ఉన్నారు.

షాపుల వద్ద ఆశీలు వసూలు నిలిపివేయాలి

కమిషనర్‌కు షాపు ఓనర్స్ అసోషియేషన్ నేతల వినతి

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఒంగోలు నగరంలో సిమెంట్, ఐరన్, ప్లే వుడ్ షాపుల వద్ద ఆశీలు వసూలు చేయడాన్ని నిలిపివేయాలని కోరుతూ కర్నూలు రోడ్డు షాపు ఓనర్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. అనంతరం నగరపాలక సంస్థ కమిషనర్ ఎం. వెంకటేశ్వరరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా కర్నూలు రోడ్డు షాపు ఓనర్స్ అసోషియేషన్ నాయకులు బత్తుల ముసలారెడ్డి మాట్లాడుతూ నగరంలో ఆశీలు లారీ ఓనర్ల దగ్గర నుంచి వసూలు చేయాల్సి ఉందన్నారు. వారు ఇవ్వనందున ఆ ఆశీలు షాప్ ఓనర్స్ దగ్గర వసూలు



కమిషన్‌ర్‌కు వినతి పత్రం అందజేస్తున్న అసోసియేషన్ నాయకులు

చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లు నిర్ణయించినట్లు తెలిపారు. ఆశీలు వసూలు పేరుతో షాపుల వద్ద తరచుగా దౌర్జన్యాలకు పాల్పడుతూ, గొడవలకు దిగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒంగోలు ఐరన్ సిమెంట్ ట్రేడర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు బత్తిన తిరుపతిస్వామి మాట్లాడుతూ ప్రభుత్వానికి తాము అనేక రకాల ట్యాక్స్‌లు కడుతున్నామని తెలిపారు. వేల రూపాయలు ట్యాక్స్‌ల రూపంలో చెల్లిస్తున్నా మళ్లీ ఆశీలు కూడా కట్టాలనడం బావ్యం కాదన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఒంగోలులో ఈ విధంగా అమలు చేస్తున్నారని తెలిపారు. తక్షణమే ఆశీలు వసూలు ఆపాలని కోరారు. సమస్య పరిష్కారం కోసం కమిషనర్‌తో యూనియన్ నాయకులు చర్చించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు రోడ్డు షాపు ఓనర్స్ అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి మారెళ్ల సుబ్బారావు, పౌర సంఘాల సమాఖ్య నగర కన్వీనర్ జి.రమేష్, మాదాల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యానికేతన్ విద్యార్థులు

ప్రజాశక్తి-చీమకుర్తి

స్థానిక విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన సూర్యతేజ, బాలచంద్ర, నాగ శివకిరణ్, రంగ నందిని, అపర్ణ, రుద్రతేజ, సంజయ్, యువశ్రీహరిని అభయకళారాధన అధ్యక్షుడు మద్దాళి మాధవరావు ఆధ్వర్యంలో శుక్రవారం అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ పి. రవీంద్రబాబు, సీనియర్ బాల్‌బ్యాడ్మింటన్ ప్లేయర్ కరిచేటి శివయ్య, పిఇటి కోటేశ్వరరావు, వెంకట్, అనంతలక్ష్మి, నాగేశ్వం రావు, షరీఫ్, వీరాంజనేయులు,ప్రమీల పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

హ్యాండ్ బాల్ పోటీలు ప్రారంభం

దొనకొండ : స్థానిక జడ్‌పి ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి హ్యాండ్ బాల్ సెలక్షన్ పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఈ పోటీలను ఎంపిపి బొరిగొర్ల ఉషా, సర్పంచ్ కొంగలేటి గ్రేస్‌రత్న ప్రారంభించారు. ఈ పోటీలకు మొత్తం 25 పాఠశాలలకు చెందిన 300 మంది విద్యార్థులు హాజరయ్యారు. అండర్-14, 15 విభాగాల్లో ప్రతిభ చూపిన 16 మంది బాలురు, 16 మంది బాలికలను జిల్లా జట్టుకు ఎంపిక చేయనున్నట్లు పీడీ నరసింహారావు తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికైనా క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ ఎన్.సాంబశివరావు, వివిధ పాఠశాలల పిఇటిలు, క్రీడాకారులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న ఎంపిపి

ప్రజలు సంతృప్తిగా ఉన్నారు : బాలినేని

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ రకాల సంక్షేమ పథకాల పట్ల ప్రజలు సంతృప్తిగా ఉన్నారని ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నగరంలోని 28వ డివిజన్ పరిధిలో లాయర్‌పేట, హరేరామ్ బజారు ప్రాంతాలలో ఎమ్మెల్యే శుక్రవారం పర్యటిం చారు. ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలు అడిగితెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి లబ్ధిదారులతో చర్చించారు. అనంతరం బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికి అందు తుండటంతో ప్రజలు ఎంతో ఆనందంగా ఉన్నారని తెలిపారు. గడపగడపకూ మన ప్రభుత్వ కార్యక్రమానికి ఆనందంగా స్వాగతం పలుకుతున్నారని తెలిపారు. తొలుత వైసిపి జిల్లా యువజన



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని

విభాగం అధ్యక్షుడు గంటా రామానాయుడు నివాసంలో బాలినేని శ్రీనివాసరెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు అల్పాహారం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, వైసిపి బిసిసెల్ జిల్లా అధ్యక్షుడు కటారి శంకర్, డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జి, కమిషనర్ ఎం. వెంకటేశ్వరరావు, 28వ డివిజన్ కార్పొరేటర్ నీలంరాజు సరోజ, వైసిపి నాయకులు నీలం రాజు రాఘవ తదితరులు పాల్గొన్నారు.

వరికూటి అశోక్‌బాబుకు ప్రొటోకాల్ పదవి?

ప్రజాశక్తి -శింగరాయకొండ

వైసిపి కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబుకు ప్రోటోకాల్ పదవి రానుంది. ఈ మేరకు నేడో, రేపో అమరావతి నుంచి ఉత్తర్వులు రానున్నట్లు సమాచారం. కొండపి నియోజక వర్గంలో డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి ఎమ్మెల్యేగా ఉన్నారు. ఎమ్మెల్యే స్వామి చేతిలో ఓడి పోయిన డాక్టర్ మాదాసి వెంకయ్యను వైసిపి కొండపి నియోజక వర్గ ఇన్‌ఛార్జిగా, పిడిసిసి బ్యాంక్ చైర్మన్‌గా నియ మించారు. ఇటీవల వైసిపి కొండపి నియోజక వర్గ ఇన్‌ఛార్జిగా వరికూటి అశోక్‌బాబును నియ మించారు. వైసిపి నియోజక వర్గ ఇన్‌ఛార్జిగా నియమితులైన వరికూటి అశోక్ బాబు నియోజక వర్గంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అయితే ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రభుత్వ



భవనాలను ప్రారంభోత్సవాలు ,శంకుస్థాపనలో పాల్గొనేందుకు అశోక్ బాబుకు ప్రోటోకాల్ పదవి అవసరం. అందులో భాగంగా వరికూటి అశోక్ బాబుకు ప్రొటోకాల్ పదవి ఇవ్వనున్నట్లు తెలిసింది. వైసిపి అధిష్టానం నుంచి పిలుపు రావడంతో రెండు రోజుల క్రితం అశోక్‌బాబు అమరావతికి వెళ్లారు. అశోక్‌బాబుకు ప్రొటోకాల్ పదవి ఇచ్చి ప్రభుత్వ కార్యక్రమాల్లో కూడా పాల్గొనే అవకాశం కల్పిస్తున్నారు.



విజేతలను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

విజేతలకు అభినందనలు

ప్రజాశక్తి-చీమకుర్తి

లిటిల్‌చాంప్స ఆధ్వర్యంలో ఒంగోలులో నిర్వహించిన జిల్లాస్థాయి నృత్య పోటీలలో చీమకుర్తి ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. 5వ తరగతి విద్యార్థిని నిహిత,7వ తరగతి విద్యార్థిని సహ్రస మొదటి బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా విజేతలను పాఠశాల యాజమాన్యం శుక్రవారం అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఎన్. చంద్రశేఖర్, అడమిక్ అడ్వయిజర్ కె. హనుమంతరావు, డైరెక్టర్ ఎన్. విద్యాపవన్, ప్రధానోపాధ్యాయుడు వీరాస్వామి, అకడమిక్ ఇన్‌ఛార్జి కోటేశ్వరరావు, అనసూయ తదితరులు పాల్గొన్నారు.



ట్యాబ్‌లు అందేస్తున్న జడ్‌పి వైస్ చైర్మన్ అరుణ

విద్యార్థినులకు ట్యాబ్‌లు పంపిణీ

ప్రజాశక్తి -శింగరాయకొండ

రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ యన్నాబత్తిన అరుణ తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదుతున్న విద్యార్థినులకు శుక్రవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ నాడు-నేడు పథకం ద్వారాప్రభుత్వ పాఠశాలను కార్పొరేట్ స్థాయికి దీటుగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. 8వ తరగతి నుంచే విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేసి డిజిటల్ విద్యను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కట్టా శోభారాణి , వైస్‌ఎంపిపి సామంతుల రవికుమార్ రెడ్డి, ఎంపిడిఒ జమీఉల్లా, ఎంఇఒ శివన్నారాయణ, ఎంపిఒ ఆదిశేషు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ సుబ్బారావు, సిఆర్‌సి కూతల వంశీ పాల్గొన్నారు. **దర్శి :** విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాలలో రాణించాలని ఎంపిపి గోళ్లపాటి సుధారాణి తెలిపారు. మండల పరిధిలోని రాజంపల్లి ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థినులకు శుఉరకవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ ఖాదర్‌బాషా, వైస్ ఎంపిపి సోము దుర్గారెడ్డి, ఎంఇఒ కాకర్ల రఘురామయ్య, సర్పంచి వనం అన్నపూర్ణ, నాయకులు గోళ్లపాటి అచ్చయ్య, బత్తినేని వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాబితాలు ఇవ్వండి : మేయర్

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

రాష్ట్ర ప్రభుత్వం త్వరలో సచివాలయ వారీగా ఏర్పాటు చేయనున్న నూతన వ్యవస్థకు సబంధించి సభ్యుల జాబితాలను అన్ని సచివాలయల నుంచి అందజేయాలని నగర మేయర్ గంగాడ సుజాత కోరారు. నగరంలోని అధికార పార్టీ కార్పొరేటర్లతో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి నివాసంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ బాలినేని శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు, రాష్ట్ర ప్రభుత్వ సూచనలతో ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సచివాలయాలు, క్లస్టర్ల వారీగా ప్రభుత్వ పథకాల పర్యవేక్షణ, సమన్వయం కోసం త్వరలో ఏర్పాటు చేయనున్న కొత్త సభ్యుల వివరాలు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు వెలనాటి మాధవరావు, వేమూరి బుజ్జి, బిసిసెల్ జిల్లా అధ్యక్షుడు కటారి శంకర్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలపై లబ్ధిదారులకు అవగాహన

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మండల పరిధిలోని గొట్లగట్టు గ్రామంలో జగనన్న కాలనీ లేఅవుట్లలోనిర్మిస్తున్న గృహాలను తహశీల్దారు ప్రసాద్‌రావు శుక్రవారం సందర్శించారు. అనంతరం లబ్ధిదారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ గృహ నిర్మాణలను వేగవంతంగా నిర్మించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రావూరి జనార్ధన్, సర్పంచి పెరికే సుఖదేవ్, హౌసింగ్ ఎఒ బాలునాయక్, చిన్నారికట్ల సింగిల్ విండో అధ్యక్షుడు ఉడుముల కాశిరెడ్డి, విఆర్ఒ దిలీప్, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ గీత, లబ్ధిదారులు పాల్గొన్నారు. **మద్దిపాడు :** జగనన్న కాలనీ లేఅవుట్ల లబ్ధిదారులు గృహ నిర్మాణాలను త్వరిత గతిన పూర్తి చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి ఝాన్సీ తెలిపారు. మండల పరిధిలోని కొలచన కోట గ్రామంలో జగనన్న కాలనీ లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఝాన్సీ మాట్లాడుతూ గృహ నిర్మాణాలు పూర్తి చేసుకుంటే వెంటనే బిల్లులు మంజూరు చేస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో తహశీల్దారు లక్ష్మినారాయణ, హౌసిగ్ ఎఒ హేమలత, పంచాయతీ రాజ్ ఎఇ సునీల్ కుమార్ పాల్గొన్నారు. **కొండపి :** జగనన్న కాలనీ లేఅవుట్ల లబ్ధిదారులు గృహ నిర్మాణాలను త్వరిత గతిన పూర్తి చేసుకోవాలని ఎంపిడిఒ బహ్మయ్య తెలిపారు. మండల



మద్దిపాడులో లబ్ధిదారులతో మాట్లాడుతున్న అధికారులు

పరిధిలోని పెట్లూరు పంచాయతీ పరిధిలోని జగనన్న కాలనీ లేవుట్, డంపింగ్ యార్డును పరిశీలించారు. అనంతరం పెట్లూరు గ్రామ సచివాలయం వద్ద లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి ఆరెతోటి ఝాన్సీరాణి, ఆరెతోటి బాబూరావు పాల్గొన్నారు. **తర్లుపాడు :** మండల పరిధిలోని చెన్నారెడ్డిపల్లి గ్రామంలో జగనన్న కాలనీ లేఅవుట్ల లబ్ధిదారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి, ఎంపిడిఒ నరసింహులు మాట్లాడుతూ లబ్ధిదారులను గృహ నిర్మాణాలను త్వరిత గతిన పూర్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు బి.శ్రీనివాసులు, వెలుగు ఎపిఎం పిచ్చయ్య, సింగిల్ విండో అధ్యక్షుడు కుందురు సత్యనారాయణరెడ్డి, గ్రామ సర్పంచి మురారి సుబ్బమ్మ, ఎంపిటిసి పి.వెంకటయ్య పాల్గొన్నారు. **జరుగుమల్లి :** జగనన్న కాలనీ లేఅవుట్ల లబ్ధిదారులు గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి గ్రంది మాధవి తెలిపారు. మండల పరిధిలోని చిరికూరపాడు గ్రామంలో చేపట్టిన గృహ నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులతో ఎంపిడిఒ రామకృష్ణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అనంతరం వావిలేటిపాడు సచివాలయాన్ని పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ గ్రామంలో మురుగు నీరు సమస్య పై స్పందించారు. మురుగు కాలువల్లో పూడిక తీయించాలని సచివాలయ కార్యదర్శిని ఆదే శించారు. జరుగుమల్లిలో నిర్మాణంలోనున్న రైతుభరోసా కేంద్రం భవనాన్ని పరిశీలించి నిర్మాణం వేగంతంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ రమేష్, హౌసింగ్ ఎఇ అవినాష్, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు. **టంగుటూరు :** జగనన్న కాలనీ లేఅవుట్ల లబ్ధిదారులు గృహ నిర్మాణాలను త్వరిత గతిన నిర్మించుకోలని మండల ప్రత్యేక అధికారి నాగిరెడ్డి తెలిపారు. మండలంలోని పొందూరు ఎస్‌సి కాలనీలో లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో ఎంపిడిఒ అజిత, ఎపిఒ సుభాషిణి, హౌసింగ్ ఎఒ రియాజ్, వైసిపినాయకుడు ఏలూరి వంశీకష్ణ పాల్గొన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-టంగుటూరు

మండల పరిధిలోని ఆలకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రిస్మస్ కేకు ను కత్తిరించి అందరికీ పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ చెంచుపున్నయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి. మురళీకష్ణ, ఉపాధ్యాయులు కె.పూర్ణశ్రీ, ఆలం రామారావు, వేణు, నార్నె రామారావు, సిఆర్‌పి సుబ్బులు తదితరులు పాల్గొన్నారు. **కొనకనమిట్ల :** స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సెమీ క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి మిఠాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ ఎస్‌పి బాలయ్య, డాక్టర్ కె.సురేఖ, పథ్వీరాజ్, నరేంద్ర సహిత సంగీత, అశోక్‌రెడ్డి, సూపర్‌వైజర్ ప్రతాపరెడ్డి, హెచ్ఒ జలీల్, పిహెచ్ఎన్ రత్నమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. **యర్రగొండపాలెం :** స్థానిక రెయిన్‌బో ఉన్నత పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు.ఈ కార్యక్రమంలో ఎంపిపి దొంతా కిరణ్ గౌడ్, వైస్ చైర్మన్ విజయకుమారి, ప్రిన్సిపల్ నిఖిలాకిరణ్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-వెలిగండ్ల

మండలంలోని మొగులూరు గ్రామానికి చెందిన ఇన్‌కమ్‌ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్ గూడూరి సురేష్‌బాబు తన తల్లి జ్ఞాపకార్ధం గూడూరి దేవమ్మ గ్రేస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలు, తల్లిదండ్రులని పిల్లలకు శుక్రవారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సురేష్‌బాబు మాట్లాడుతూ దేవమ్మ గ్రేస్ ట్రస్ట్ ద్వారా ప్రతి ఏడాది తన కుమార్తె గ్రేస్ పుట్టినరోజు సందర్భంగా పేదలకు తమ వంతు సాయం అందిస్తున్నట్లు తెలిపారు. ట్రస్టు ద్వారా భవిష్యత్తులో పేదలకు సాయమందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గూడూరి అనిల్‌బాబు, పాస్టర్ జాన్, బంగారయ్య, స్టాలిన్, గూడూరి రవి, దేవయ్య, గంగవరపు జ్యోతి, గంగవరపు పణికుమార్, వని, జయపాల్, ఆమోస్ పాల్గొన్నారు.

జాతీయ రైతు దినోత్సవం

ప్రజాశక్తి-దర్శి

మాజీ ప్రధానమంత్రి చరణ్‌సింగ్ జయంతిని పురస్కరించుకుని కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రధానశాస్త్రవేత్త డాక్టర్ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో రైతు దినోత్సవ వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ దేశానికి, రైతులకు చరణ్‌సింగ్ చేసిన సేవలను కొనియాడారు. వ్యవసాయ కుటుంబంలో పుట్టిన చరణ్‌సింగా ప్రధానమంత్రి స్థాయికి ఎదగడం అభినంద నీయమని తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ కళాశాల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు వెంకటేశ్వరరెడ్డి, శివలీలాకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

వీధిలైట్లకు మరమ్మతులు

తర్లుపాడు : మండల పరిధిలోని చెన్నారెడ్డిపల్లి పంచాయతీలోని వీధులను ముస్తాబ్ చేస్తున్నారు. అందులో భాగంగా పంచాయతీ పరిధిలోని అన్ని వీధుల్లో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తున్నారు. గ్రామంలో ఎక్కడైనా వీధి దీపాలు వెలగక పోతే పంచాయతీ వార్డు మెంబరు, లేదా స్థానిక నాయకులు, వాలంటీర్ల దృష్టికి తీసుకెళ్లితే కొత్తలైట్లు వేయిస్తామని ఎంపిడిఒ ఎస్.నరసింహులు తెలిపారు. ఎంపిడిఒ ఎస్.నరసింహులు ఆదేశాల మేరకు పనిచేయని దీపాలకు శుక్రవారం మర్మతులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో ప్రెసిడెంట్ కుందురు సత్యనారాయణరెడ్డి, సర్పంచి మురారి సుబ్బమ్మ, ఎంపిటిసి పి.వెంకటయ్య, పంచాయతీ కార్యదర్శి కె.మనోహర్‌రెడ్డి, వెల్ఫేర్ అసిస్టెంట్ సుధీర్, టైపిస్టు భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

వాలీబాల్ విజేతలకు అభినందనలు

తర్లుపాడు : ఇగ్నైట్ యంగ్ మైండ్స్ వారి ఆధ్వర్యంలో మార్కాపురం నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారు. త్రో బాల్ పోటీల్లో బాలికలు ద్వితీయ స్థానంలో నిలించారు. విజేతలను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.మాధవి, ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు.

పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి-కనిగిరి

వివిధ ప్రాంతాల నుంచి కనిగిరికి వలస వచ్చిన పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని సిపిఎం జిల్లా నాయకులు పివి. శేషయ్య,సిపిఐఎంఎల్ నాయకులు పివి. రమణారెడ్డి కోరారు. కనిగిరి మున్సిపాలిటీలోని మోడల్ స్కూల్ సమీపంలోని జగనన్న కాలనీ వద్ద ప్రభుత్వ భూమిలో యానాదులు గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్న పాంతాన్ని శుక్రవారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా యానాదుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పేదలకు నివేశన స్థలాలు



యానాదులతో మాట్లాడుతున్న నాయకులు

మంజూరు చేసి, మౌళిక వసతులు కల్పించేందుకు అధికారులు,నాయకులు చొరవచూపాలని కోరారు.

చంద్రశేఖర్‌కు ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి-పొదిలి

మండల పరిధిలోని అన్నవరం గ్రామానికి చెందిన వైసిపి యువ నాయకులు కొత్త పులి చంద్రశేఖర్ రెడ్డి శుక్రవారం మృతిచెందాడు. ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషమించడంతో మృతి చెందారు. ఈ విషయం గురించి తెలుసుకున్నొ మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జున రెడ్డి చంద్రశేఖర్ మృతదేహాన్ని సందర్శించి పులమాలలు వేసి నివాళులర్పించారు. నిలవాళుర్పించిన వారిలో వైసిపి నాయకులు సానికొమ్ము శ్రీనివాసుల రెడ్డి, కసిరెడ్డి వెంకట రమణారెడ్డి, గొలమారి చెన్నారెడ్డి, జి. శ్రీను, కల్లం సుబ్బారెడ్డి, కొండ్రగుంట సుబ్బారావు, కొత్తపులి బ్రహ్మారెడ్డి, ఉడుముల గురవారెడ్డి తదిరులు ఉన్నారు.

రాఘవయ్య విగ్రహం ఆవిష్కరణ

మద్దిపాడు : మద్దిపాడుకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిన డోలు విద్వాంసుడు ఈమని రాఘవయ్య అభినందనీయుడని శ్రీనటరాజ కళాసమితి అధ్యక్షుడు, కెవివిపి మండల అధ్యక్షుడు కాకుమాను సుబ్బారావు పేర్కొన్నారు. నటరాజ కళాకేంద్రం ఆవరణలో ఈమని రాఘవయ్య విగ్రహాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ రాఘవయ్య ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లోనే కాక దేశంలో అనేక రాష్ట్రలలో కచేరీలు చేసి సన్మానాలు, అవార్డులు అందుకున్నట్లు తెలిపారు.అనంతరం రాఘవయ్య విగ్రహ ఏర్పాటుకు కృషి చేసిన వివేకా, విజయలక్ష్మిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు జి. నరసింహారావు కలాం, షరీఫ్, డి. యలమంద, గంటా కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బోగస్ ఓట్లు తొలగించాలని తహశీల్దారుకు వినతి

ప్రజాశక్తి-కొనకనమిట్ల

తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల జాబితాలో బోగస్ ఓట్లు ఉన్నాయని, వాటిని తొలగించాలని కోరుతూ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి అబ్దుల్‌హై ఆధ్వర్యంలో తహశీల్దారు ప్రసాద్‌రావుకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అబ్దుల్‌హై మాట్లాడుతూ 2వ దఫా ఓటర్ల నమోదు కార్యక్రమంలో బోగస్ ఓట్లు ఎక్కువగా నమోదైనట్లు తెలిపారు. ఓటర్ జాబితాను నిశితంగా పరిశీలించి అర్హత లేని వారిని తొలగించాలన్నారు. అర్హత కలిగిన వారికి అవకాశం కల్పించాలని కోరారు. అనంతరం బోగస్ ఓటర్లకు సంబంధించిన వివరాలను తహశీల్దారుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్



తహశీల్దారుకు వినతి పత్రం ఇస్తున్న యుటిఎఫ్ నాయకులు

కౌన్సిలర్ పి.శ్రీనివాసులరెడ్డి, తాళ్లూరు చిన్నబాబూరావు, వరకాల మస్తాన్, తోట యేగిరామయ్య, కె.మాల్యాద్రి, పి.సతీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

స్థానిక మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం ఎదుట జాతీయ బీసీ జేఏసీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ యుఎన్‌ఆర్ చేతుల మీదగా నియోజకవర్గ అధ్యక్షులు పోసాని శ్రీరాములు ఆధ్వర్యంలో ఓబీసీ మేలుకో..నీ లెక్క తేల్చుకో అనే వాల్ పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ యుఎన్‌ఆర్ మాట్లాడుతూ బీసీలను అన్ని రాజకీయ పార్టీలు కేవలం ఓటు బ్యాంకుగానే పరిగణిస్తున్నాయని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీ కుల గణన వెంటనే చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ విద్యార్థి విభాగం అధ్యక్షుడు విజయ్, నియోజకవర్గ అధ్యక్షుడు పోసాని శ్రీరాములు, రాష్ట్ర బీసీ డైరెక్టర్ రామారావు, కొర్రపోలు గురవయ్య, మహిళా నాయకురాలు కంచర్ల సరస్వతి, నియోజకవర్గ కోశాధికారి పోలయ్య, నియోజకవర్గ అధికార ప్రతినిధి పాలూరి శ్రీను, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు చెల్లి ఆత్మరాములు, యర్రగొండపాలెం మండల యువజన సంఘం అధ్యక్షుడు గుర్రం శేషగిరిరావు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందనలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ చేతులు మీదుగా గురువారం విద్యార్థినులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 8వ తరగతి విద్యార్థిని ఉమాదేవి జేవీకే పాఠశాల విద్యార్థినుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి , సేవలు, అమ్మబడి, ఇతర ఉచిత పథకాల గురించి వివరించింది. అందులో భాగంగా ఉమాదేవికి ఎంఇఒ ఆంజనేయులు శుక్రవారం బహుమతులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఎంఇఒ ఆంజనేయులు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి స్వేచ్ఛగా, ధైర్యంగా మాట్లాడాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శేషారావు, మురళీకృష్ణ, ఉపాధ్యాయులు నందగోపాల్, యోగయ్య నాయక్, పోలమ్మ, సిఆర్‌పి కోటి పాల్గొన్నారు.

రహదారులను కమ్మేసిన మంచు

యర్రగొండపాలెం : . యర్రగొండపాలెం నియోజకవర్గం లోని యర్రగొండపాలెం, పెద్దారవీడు, త్రిపురాంతకం మండలాల్లో సాయంత్రం 6 గంటల నుంచే మంచు పడుతూ చలి తీవ్రత పెరుగుతోంది. గత నాలుగు రోజులుగా మంచు, చలి తీవ్రత ఎక్కువగా ఉంది. శుక్రవారం ఉదయం 9 గంటల వరకూ మంచు అలాగే ఉండి రహదారులను కమ్మేసింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మంచు కారణంగా ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదని వాహనదారులు చెబుతున్నారు.

కార్పొరేట్ విద్య అందించడమే వైసిపి లక్ష్యం: బలరాం

మండల స్థాయిలో 8వ తరగతి విద్యార్థులకు 1073 ట్యాబ్‌ల పంపిణీ

ప్రజాశక్తి-చీరాల

దేశ భవిష్యత్తు విద్యార్థులేనని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నూతన విద్యా విధానాన్ని ప్రవేశపెట్టారని చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అన్నారు. మండలంలోని ఈపురిపాలెం గర్ల్స్ హైస్కూల్లో ఎనిమిదో తరగతి విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాపట్ల జిల్లా ఏర్పడి తర్వాత మొదటిగా తన పుట్టినరోజు వేడుకలు బాపట్ల జిల్లాలో జరుపుకోవాలని ఎంతో ఆనందంగా ఉందని సీఎం తన సభలో తెలిపిన విషయాలను విద్యార్థులతో పంచుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం అమలు చేయడంతో పాటు, అమ్మఒడి పథకం, నాణ్యమైన మిడ్ డే మీల్స్, కంప్యూటర్ శిక్షణ, విద్యారంగాన్ని అభివృద్ధి చేసిన ఘనత వైసిపికే దక్కుతుందని అన్నారు. ముందుగా విద్యార్థులతో సీఎం జన్మదిన కేక్ కటింగ్ నిర్వహించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, మండల పార్టీ నాయకులు శ్రీనివాసరావు, రూరల్ సిఐ మల్లికార్జునరావు, ఎంఈఓ నాగేశ్వరరావు, ఈపురిపాలెం హెచ్‌ఎం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల రూరల్: బైజూస్ ట్యాబ్‌లతో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సాంకేతిక విద్యకు పునాది పడిందని బాపట్ల శాసన సభ్యులు కోన రఘుపతి అన్నారు. బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో శుక్రవారం బైజూస్ ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాసనసభ్యులు కోన రఘుపతి పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా బాపట్ల శాసనసభ్యుల చేతుల మీదుగా 8వ తరగతి విద్యార్థులకు ట్యాబులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ నిరంజన్, ఎంపీడీవో రాధాకృష్ణ, ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు, బాపట్ల వైసిపి పట్టణ అధ్యక్షులు నరాలశెట్టి ప్రకాష్‌రావు, మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి, విద్యా కమిటీ వైస్ చైర్మన్ శీలం సాగర్, వైసిపి మండల అధ్యక్షులు కోకి రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బాపట్లలో ట్యాబ్‌లు అందిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి


ఇంకొల్లులో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఇంకొల్లు రూరల్: ఇంకొల్లు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 106 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు 8వ తరగతి చదువుకున్న పిల్లలకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జెడిఇ చంద్రిక, జడ్పిటిసి భవనం శ్రీలక్ష్మి, ఎంపిపి బండారు అనూష చేతుల మీదుగా విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. మండలంలోని పూసపాడు ఎస్‌కెపిఎవిఎస్ హైస్కూలులో 34 మంది విద్యార్థులకు, ఇడుపులపాడు విద్యా పరిషత్ ఉన్నత పాఠశాలలో 34 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ కార్యక్రమం జరిగింది. పూసపాడు సర్పంచ్ పాలూరి రమాదేవి రాంబాబు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు రావి రత్తమ్మ, మాజీ జెడ్పిటిసి సభ్యులు భవనం శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ బండారు ప్రభాకర్, వైస్ ఎంపిపి చలమయ్య, ఎంపిటిసి హయాషాబుడే, ఎంపిటిసి రావి పేరయ్య, మండల విద్యాశాఖాధికారి ఎంవి సత్యనారాయణ, హెచ్‌ఎం శ్రీనివాసరావు, కె శ్రీనివాసరావు, పిడపర్తి పేరిరెడ్డి, బండారు జక్రయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


కూకట్ల శ్రీనివాసరావును సన్మానిస్తున్న దృశ్యం

ఎన్నారై శ్రీనివాసరావుకు సన్మానం

ప్రజాశక్తి-అద్దంకి

గత 15 సంవత్సరాలుగా అమెరికాలో ఉంటూ తెలుగువాళ్లకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న అద్దంకి పట్టణానికి చెందిన కూకట్ల శ్రీనివాసరావును శుక్రవారం ఘనంగా సత్కరించారు. తానా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 25న ఆదివారం చేపట్టే కార్యక్రమాల్లో పాల్గొనే నిమిత్తం అద్దంకికి వచ్చిన ఆయనను రోటరీ క్లబ్ ఆఫ్ మాజీ అసిస్టెంట్ గవర్నర్, మాజీ అధ్యక్షులు వీరవల్లి సుబ్బారావు సూచన మేరకు స్థానిక వాసవి నగర్‌లోని రుద్రయ్య నివాసానికి శ్రీనివాసరావును శుక్రవారం ఆహ్వానించి సన్మానించారు. ఈ సందర్భంగా రుద్రయ్య మర్యాదపూర్వకంగా శ్రీనివాసరావును ఘనంగా సత్కరించి అద్దంకి అభివృద్ధికి తానా ఫౌండేషన్ తరపున సహకరించాలని కోరారు. తానా ఫౌండేషన్ ఈవెంట్స్ మేనేజ్మెంట్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ తాను తిమ్మాయపాలెంలో పుట్టి పెరిగి అద్దంకిలో పాఠశాల విద్య వరకు అభ్యసించినట్లు తెలిపారు. తరువాత డిప్లమో, ఇంజనీరింగ్ చదివి గత 15 సం క్రితం ఉన్నత విద్యకు అమెరికాలోని మేరీల్యాండ్ వెళ్లి అక్కడే స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. తాము అక్కడ కూకట్ల ఫౌండేషన్ను ఏర్పాటు చేసుకొని ఆ రాష్ట్రంలోని మన తెలుగువాళ్లకు ఏ సమస్య వచ్చినా సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సేవా కార్యక్రమాల్లో భాగంగా అద్దంకిలో చేపట్టాలని ఫౌండేషన్ కమిటీ నిర్ణయం మేరకు అద్దంకిలో ఈ నెల 25వ తేదీన స్థానిక సింగరకొండ రోడ్‌లోని కూకట్ల కన్వెన్షన్ ఫంక్షన్ హాల్‌లో మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.పలు సేవా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిఎల్‌వి నరసింహారావు, మన్నం త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్లకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-కర్లపాలెం

కర్లపాలెం మండలం కర్లపాలెం పంచాయతీ కార్యాలయంలో పనిచేస్తున్న 32 మంది స్వీపర్లకు క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని సర్పంచ్ నక్కా లలిత కుమారి ఆర్థిక సహకారంతో సమకూర్చిన నూతన వస్త్రాలు, స్వీట్సును సర్పంచ్‌తో కలిసి అందజేసిన జిల్లా పంచాయతీ అధికారి రమేష్ బాబు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్, డిపిఓ ఆదేశాల మేరకు పంచాయతీలో పనిచేస్తున్న 32 మంది స్వీపర్లకు క్రిస్మస్‌ను పురస్కరించుకుని ఇలా దుస్తులు, స్వీట్లు పంపిణీ చేయడం చాలా సంతోషదాయకమని అన్నారు. మన గ్రామాలు పరిశుభ్రంగా ఉన్నాయంటే స్వీపర్లే కారణమని అన్నారు. జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా ప్రతి గ్రామాన్ని ఇలాగే పరిశుభ్రంగా ఉంచుకొని అందరూ ఆరోగ్యంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమానికి సహకారం అందించిన కర్లపాలెం సర్పంచి నక్కా లలిత కుమారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌డివో సువార్త, డిఎల్‌పిఒ శరత్‌బాబు, ఎంపీడీవో ఎలీషా బాబు, కార్యదర్శి శ్రీనివాసరావు, జడ్పిటిసి వేణుగోపాల్‌రెడ్డి, ఎంపిటిసి ఆసిఫ్ అలీ, కో ఆప్షన్ సభ్యులు అమీర్ బేగ్, ఉపసర్పంచి పఠాన్, పదోవార్డు మెంబర్ కరిముల్లా, నాయకులు జయభరత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పంగులూరు: సమాజంలో ప్రతి ఒక్కరూ శాంతి, సౌభ్రాతృత్వం, పేదల పట్ల ప్రేమ, తోటి వారికి సహకరించడమే నిజమైన క్రిస్మస్ అని పలువురు వక్తలు అన్నారు. శుక్రవారం పంగులూరు గ్రామ పంచాయతీలో, సెమీ క్రిస్టమస్ వేడుకలు ఘనంగా జరిగాయి. క్రిస్మస్ కేకును కట్ చేసి అందరికి పంచిపెట్టారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర నాయకులు నాగబోయిన రంగారావు మాట్లాడుతూ, ప్రపంచ శాంతికి క్రీస్తు బోధనలు ఎంతో ఉపయోగపడ్డాయని, ప్రతి మనిషి తోటివారికి సహకరించాలని, దయ, ప్రేమ, కలిగి ఉండాలని అన్నారు. పేదల అభ్యున్నతి కోసం ఈ మండలంలో తాము ఎన్నో పోరాటాలు చేశామని, ఫలితాలు సాధించామని చెప్పారు. తాము చేసిన పోరాటాలు పేదలందరినీ ఐక్యం చేసేందుకు ఉపయోగపడ్డాయని అన్నారు. ఎంపీడీవో ఎంవి రమణమూర్తి మాట్లాడారు. అంతకుముందు పాస్టర్ కాంతారావు క్రీస్తు జననం గురించి వివరించారు. అనంతరం క్రిస్మస్ కేకును పంచిపెట్టారు. ఈ సందర్భంగా పంచాయతీలో పనిచేసే కార్మికులకు, సిబ్బందికి నూతన వస్త్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి గుడిపూడి నాగేంద్రమ్మ, మండల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రాయిని వెంకట సుబ్బారావు, పంచాయతీ సెక్రెటరీ సునీత ఈఓఆర్‌డి రాంబాబు, వైసిపి నాయకుడు గుడిపూడి రామారావు తదితరులు ప్రసంగించారు.


గ్రీన్ అంబాసిడర్లకు దుస్తులు, స్వీట్స్ పంపిణీ చేస్తున్న జిల్లా పంచాయతీ అధికారి రమేష్ బాబు

రేపల్లె: పట్టణ టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అధ్యక్షతన ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి సెమీ క్రిస్మస్ వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగేవని గుర్తు చేసుకున్నారు. క్రిస్మస్ సందర్భంగా పేద ప్రజలకు క్రిస్మస్ కానుకలు ఇచ్చే వారమని. కాని నేడు ఏ కానుకలు లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. టిడిపి అధికారంలో ఉన్నప్పుడు క్రైస్తవ సోదరులను అన్ని విధాలా ఆదుకున్నట్లు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య, జివి నాగేశ్వరరావు, జివి రామారావు, ఎస్సీ సెల్ కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చీరాల: ఆపదలో ఉన్న వారి అవసరాలను గుర్తించి వారికి సాయం అందిస్తూ చేయూతనివ్వటం అందరి బాధ్యత అని టిఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాల కమిటీ సభ్యులు గంటా అనిల్ కుమార్ అన్నారు. గంటా సుబ్బారాయుడు నాగమ్మ మరియు చాగంటి జింకయ్య, రత్తమ్మ జ్ఞాపకార్థం చేస్తున్న పలుసేవ కార్యక్రమాలలో భాగంగా తన తండ్రి గంటా భాస్కర్‌రావు 33వ వర్ధంతి సందర్భంగా గంటా పద్మావతి, భాస్కరరావు జ్ఞాపకార్థం శుక్రవారం పేరాలలోని విజిలీ పేట, మరియమ్మ పేటలో ఉన్న అనాథ వృద్ధులకు 25 కేజీల బియ్యం బస్తాలు, వంట సామగ్రిని ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో కారుమంచి సుబ్బారావు, విజిలీపేట వాసులు పాల్గొన్నారు.

అంబేద్కర్ భవన్‌లో..

ఏసుక్రీస్తు ప్రేమ స్వరూపియని ప్రేమ, శాంతిని ప్రభోదించిన క్రీస్తు మార్గం అనుసరణీయమని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అన్నారు. చీరాల పురపాలక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం అంబేద్కర్ భవన్లో ఐక్య క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కరణం హాజరయి మాట్లాడారు. క్రిస్మస్ గొప్ప పర్వదినమని, క్రీస్తు బోధనలు, ఆయన చూపిన మార్గం అందరికీ ఆదర్శనీయమని అన్నారు. ప్రతి ఒక్కరిపై ప్రేమ, దయ, కరుణ చూపాలని చెప్పారు. పాస్టర్ రాజేష్ క్రీస్తు సందేశాన్ని వినిపించారు. అనంతరం క్రిస్మస్ కేకును కోసి ఒకరికొకరు శుభాకాంక్షలను తెలియజేసుకున్నారు. కార్యక్రమంలో ఆర్డీవో సరోజిని, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, కమిషనర్ రసయ్య, తహసీల్దార్ ప్రభాకర్రావు, ఆయా శాఖల ఉద్యోగులు, సిబ్బంది, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

భట్టిప్రోలు: సెమీ క్రిస్మస్ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మండల సమాఖ్య ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలు సెమీ క్రిస్మస్ వేడుకను మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించగా ఎంపిపి డివి లలితకుమారి, జెడ్పిటిసి టి ఉదయ్ భాస్కరి, ఎంపిడిఓ చంద్రశేఖర్, తహసీల్దార్ శ్రావణ్ కుమార్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే సూరేపల్లి పంచాయతీ పరిధిలోని వేమవరం మండల పరిషత్ పాఠశాల (ఎల్‌ఈ)లో సెమీ క్రిస్మస్ వేడుకను నిర్వహించారు. భట్టిప్రోలు పిహెచ్‌సి వైద్యులు ఆరేపల్లి శ్రీనివాసరావు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కరోనా వేరియంట్ ప్రబలుతున్న దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం శోభన్, ఈఓపిఆర్‌డి శేఖర్‌బాబు, ఉపాధ్యక్షులు కె పిచ్చయ్యశాస్త్రి, నాయకులు బాలాజీ, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి

క్రిస్మస్ సందర్భంగా పారిశుధ్య పనులు

క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని భట్టిప్రోలు గ్రామ పంచాయతీలో సర్పంచ్ దారా రవికిరణ్మయి ఆధ్వర్యంలో పారిశుధ్య చర్యలు చేపట్టారు. కార్మికులతో ఎక్కడికక్కడ మురుగు కాలువలు పూడికతీత, విధులు శుభ్రపర్చి బ్లీచింగ్, సున్నం వంటి వాటిని చెల్లిస్తున్నారు. క్రిస్మస్ పండుగను ఉత్సాహంగా, ఉల్లాసంగా జరుపుకోవాలని ఆమె సూచించారు. ఈ మేరకు గ్రామ ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.


సదస్సులో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి పి వేణుగోపాల్

ఘనంగా జాతీయ రైతు దినోత్సవం

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

ఇంకొల్లు మండలంలోని పావులూరు గ్రామంలో పిపిఎల్ కంపెనీ సారథ్యంలో జాతీయ రైతు దినోత్సవం నిర్వహించారు. రైతుల పొలాలను కంపెనీ ప్రతినిధులు సందర్శించినారు. అనంతరం ఈ కార్యక్రమంలో కంపెనీ ఎండిఓ ఎస్ ఎండి రఫీ మాట్లాడుతూ మాజీ ప్రధానమంత్రి చౌదరి చరణ్‌సింగ్ రైతులకు చేసిన విశిష్ట సేవలను గుర్తిస్తూ ఆయన జన్మదినం సందర్భంగా జాతీయ రైతు దినోత్సవం ప్రతి సంవత్సరం డిసెంబర్ 23వ తేదీన జరుపుకుంటారని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మండల వ్యవసాయ అధికారి పి వేణుగోపాల్ మాట్లాడుతూ రైతులందరికి రైతు దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. పురుగుమందులు, రేపర్ ఎలా వాడాలో రైతులకు సూచనలు తెలియజేశారు. రైతు దినోత్సవం సందర్భంగా కంపెనీ వారు మార్కెట్లోకి కొత్తరకం ఉత్పత్తి అయిన నవ శక్తి అను బయో ఫెర్టిలైజర్‌ను విడుదల చేశారు. గ్రామంలో రైతులకు కంపెనీ ప్రతినిధులు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం తమకు బాగా ఉపయోగపడుతుందని గ్రామాలను రైతులను కంపెనీ ప్రతినిధులను అభినందించారు. మార్కెటింగ్ ఆఫీసర్ ప్రభాకర్, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ వినయ్, ఎంఆ ప్రసాద్, డిబిటి ఎస్ వెంకట్రావు, గ్రామంలోని రైతులు పాల్గొన్నారు.

పొగాకు రైతులకు

రూ.25 వేల చొప్పున పరిహారమివ్వాలి

27న ఆర్ఎం ఆఫీస్ వద్దకు రాయబారం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మాండూస్ తుఫాన్‌తో పొగాకు రైతులు తీవ్రంగా నష్టపోయారని వారిని వెంటనే ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకటరావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి.బాలకోటయ్య కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. జిల్లాలో దాదాపు 60 వేల ఎకరాలు పొగాకు పంట తీవ్రంగా దెబ్బతిందని, అకాల వర్షాలతో పొగాకు రైతులు నష్టపోయారని వారిని వెంటనే ఆదుకోవాలన్నారు. ఈ నెల 24న పొగాకు బోర్డు రీజనల్ మేనేజర్ కార్యాలయం కార్యక్రమంలో రైతులు ఎక్కువగా పాల్గొనాలని కోరారు. దెబ్బతిన్న పొగాకు వెంటనే నమోదు చేసి ఎకరాకు రూ.25 వేలు నష్టపరిహారం ఇవ్వాలని, రుణాలు రీషెడ్యూల్ చేసి పంట వేసు కోవటానికి వడ్డీ లేని రుణాలు ఇవ్వాలన్నారు. వాతావరణ బీమాను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎప్పుడూ లేనివిధంగా నేడు వర్షాలు వారం రోజులు పడటంతో పొగాకు కాక, శనగ, మిర్చి, కంది పంటలు దెబ్బతిన్నాయన్నారు. ఈ పంటల నమోదుచేసి నష్టపరిహారం ఇవ్వటం ద్వారా రైతులను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. పొగాకు రైతులను ఆదుకోవాలని కోరుతూ ఈ నెల 27న పొగాకు బోర్డు ఆర్ఎంకు రాయబారంలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పార్లమెంట్ సమావేశాల్లో

వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

కలెక్టరేట్ గేట్లు ఎక్కిన ఎంఆర్‌పిఎస్ నాయకులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

పార్లమెంట్ సమావేశాలలో ఎస్‌సి వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి ఉపకులాలకు న్యాయం జరిగేలా చూడాలని మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా పరిశీలకులు బ్రహ్మయ్య మాదిగ డిమాండ్ చేశారు. ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఎస్సీ వర్గీకరణ బిల్లు పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టి డిమాండ్ శుక్రవారం కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం జరిగింది. తొలుత స్థానిక అంబేద్కర్ భవనం నుండి ర్యాలీగా బయలుదేరి హెచ్ఎం దగ్గర అంబేద్కర్ విగ్రహం వరకు వెళ్లి చర్చి మీదుగా కలెక్టర్ కార్యాలయం ముట్టడి చేపట్టారు. కలెక్టరేట్‌లోకి చొచ్చుకెళ్ళేందుకు ఎంఆర్‌పిఎస్ కార్యకర్తలు ప్రయత్నించటంతో పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పిఎస్ కార్యకర్తలు, పోలీసులకు మధ్య వాగ్వివాదం జరిగింది. అనంతరం కొంత మందిని డిఆర్‌ఒకు వినతిపత్రం ఇవ్వటానికి అనుమతించారు. అనంతరం డిఆర్‌ఓను కలసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు ఆనాల సురేష్, జాతీయ నాయకులు షేక్ సలాం పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో

కార్పొరేట్ స్థాయిలో విద్యాబోధన

ట్యాబుల పంపిణీలో కలెక్టర్ దినేష్‌కుమార్



విద్యార్థులకు ట్యాబులు పంపిణీ చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మార్కాపురం

కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధనకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టి నట్లు కలెక్టర్ ఎఎస్.దినేష్ కుమార్ పేర్కొన్నారు. పేద పిల్లలకు కూడా కార్పొరేట్ స్థాయిలో విద్య అందేలా విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. మార్కాపురం మం డలం, మార్కాపురం పట్టణ పరిధిలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో ఎని మిదో తరగతి చదువుతున్న విద్యా ర్థులకు ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు కుందురు నాగార్జునరెడ్డితో కలిసి కలెక్టర్ దినేష్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో రాణించేలా ప్రభుత్వం విద్యార్థులకు అన్ని సదుపాయాలు అందుబాటులోకి తెచ్చేలా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఈ మూడున్నర సంవత్సరాల కాలంలో విద్యారంగ అభివృద్ధికి జిల్లాలో రూ. 53 వేల కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు. ఇప్పటికే అమ్మఒడి, విద్యా కానుక పథకాల ద్వారా పుస్తకాలు, ఏకరూప దుస్తులు అందించి, నాడు-నేడు పథకంతో పాఠశాలల్లో అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ట్యాబ్‌లు కూడా పంపిణీ చేస్తోందన్నారు. మార్కాపురం శాసనసభ్యులు కుందురు నాగార్జునరెడ్డి మాట్లాడుతూ తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాలలో ప్రతి విద్యార్థికి సులభంగా అర్ధమయ్యే రీతిలో సబ్జెక్టును నిక్షిప్తం చేసిన ఈ ట్యాబులు పంపిణీ చేయడం చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు. వీటిని సమర్ధవంతంగా వినియోగించుకోవాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులకు అసవరమైన మార్గ నిర్దేశం చేయాలని ఉపాధ్యాయులను కూడా ఈ సందర్భంగా ఆయన కోరారు. సబ్ కలెక్టర్ సేతు మాధవన్ మాట్లాడుతూ తాను కూడా ప్రభుత్వ కళాశాలలో చదువుకున్నానని, కానీ అప్పట్లో తమకు ఇన్ని సౌకర్యాలు, టెక్నాలజీ అందుబాటులో లేదని తెలిపారు. పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జిల్లా విద్యాశాఖ అధికారి బి.విజయ భాస్కర్ మాట్లాడుతూ మార్కాపురం మండలంలోని 27 పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న 1568 మంది విద్యార్థులకు, 136 మంది ఉపాధ్యాయులకు ఈ ట్యాబులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఆఫ్‌లైన్ విధానంలో ఈ ట్యాబులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సబ్జెక్టుల ద్వారా విద్యార్థుల్లో విషయ పరిజ్ఞానం మరింత పెరుగుతుందన్నారు. అనంతరం అతిథుల చేతుల మీదుగా విద్యార్థులు ట్యాబులను అందుకున్నారు. కరోనా బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేసే ఇతివృత్తంతో విద్యార్థినులు ప్రదర్శించిన నృత్యం ఆకట్టుకుంది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మునగాల చంద్రశేఖరరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మార్కాపురం మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీక్రిష్ణ, మార్కాపురం ఎంపిపి పోరెడ్డి అరుణ చెంచిరెడ్డి, జడ్‌పిటిసి నారు బాపన్‌రెడ్డి, డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ బివిఎన్ సాయికుమార్, డిప్యూటి డిఇఒ చంద్రమౌళీశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ బిఎస్ గిరికుమార్, ఎంపిడిఒ టి.చందన, తహాశీల్దారు శ్రీనివాసరావు, ఎంఇఒ బి.రాందాస్‌నాయక్ పాల్గొన్నారు.

గంజాయి విక్రయాలపై ప్రత్యేక నిఘా

- నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో ప్రజాశాంతికి భంగం కలగకుండా ముందస్తు చర్యలు
- పెండింగ్ కేసులపై ప్రత్యేక శ్రద్ధ వహించి త్వరితగతిన పరిష్కరించాలి
- నేర సమీక్షలో ఎస్‌పి మల్లికగర్గ్



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్‌పి మల్లికగర్గ్

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

గంజాయి వంటి నిషేధిత మాదకద్రవ్యాల అక్రమ రవాణా చేసే, విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటుచేయాలని, నిందితులపై చర్యలు తీసుకోవాలని ఎస్‌పి మల్లికగర్గ్ పోలీసు అధికారులను ఆదేశించారు. మాదక ద్రవ్యాలు సేవించడం వల్ల కలిగే దుష్ప్రభావాలు, చట్టపరమైన చర్యల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలోని డిఎస్పీలు, సిఐలు, ఎస్సైలతో ఎస్పీ మల్లికగర్గ్ జిల్లా పోలీసు కార్యాలయంలో నెలవారీ నేరసమీక్షా సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్పీ ప్రత్యేకించి 2020, 2021 మరియు 2022 నుండి పెండింగ్ లో ఉన్న గ్రేవ్ అండ్ నాన్ గ్రేవ్ కేసులు, మర్డర్, డెకాయిటి, రాబరీ, ప్రాపర్టీ, వాహనాలు దొంగతనం, మిస్సింగ్, చీటింగ్, సైబర్ నేరాలు మరియు ఇతర కేసులతో పాటు డిపిఓలో వివిధ పెండింగ్ రిప్లయ్స్ సమీక్షించారు. పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్ కేసుల వివరాలు, ప్రస్తుత కేసుల స్థితిగతులు, నమోదైన కేసుల్లో నేరస్తుల అరెస్టు, కేసు దర్యాప్తు తీరుతెన్నులపై సంబంధిత పోలీస్ అధికారులతో ఆరా తీసి కేసుల ఫైల్స్ , రికార్డ్స్ ను క్షుణ్ణంగా పరిశీలించారు. కేసుల ఛేదింపునకు మరియు పరిష్కారానికి, నేర నియంత్రణకు దోహదం చేసే పలు సూచనలు, మెళకువల గురించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. పోలీస్ స్టేషన్ల వారీగా యూఐ కేసులు తగ్గించుకోవాలని, వీలైనంత త్వరగా పెండింగ్ కేసులను పరిష్కార దశకు తీసుకురావాలని, అరెస్టులు, చార్జ్‌షీట్లు, సమన్లు, నాన్ బెయిలబుల్ వారెంట్లు పెండింగ్‌లో ఉంచకుండా సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోక్సో కేసులు మరియు రేప్ కేసులలో దర్యాప్తు వేగాన్ని పెంచాలని, హత్య మరియు ఇతర కీలకమైన కేసుల్లో శాస్త్రీయ పద్ధతులలో దర్యాప్తు సమగ్రంగా చేపట్టాలని చెప్పారు. మహిళల, చిన్నారుల అదశ్యం కేసులలో ఏ విధమైన అలసత్వం చూపించకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రాపర్టీ నేరాల్లో నిందితులను త్వరగా పట్టుకొని.. ప్రాపర్టీ రికవరీ శాతాన్ని పెంచాలన్నారు. రాత్రి సమయంలో రెగ్యులర్ బీట్లతో వాహనాల తనిఖీలు చేసి దొంగతనాలు కట్టడి చేయాలని, నేర నియంత్రణకు విస్తతంగా విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలని ఆదేశించారు. పొగ మంచు పడే సమయాల్లో రోడ్డుప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. వాహన తనిఖీలు చేపట్టి ఎం.వి.చట్టం ప్రకారం జరిమానాలు విధిస్తూ, ప్రతి ఒక్కరూ రహదారి భద్రత నియమాలు పాటించేలా చేయాలని తెలియజేశారు.

గ్రామ/వార్డు సచివాలయ పరిధిలోని మహిళా పోలీసులకు కేటాయించిన వివిధ టాస్కులను సక్రమంగా సమర్థవంతంగా నిర్వహించేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాలలో ఎంట్రీ మరియు ఎగ్జిట్ ప్రాంతంలో కెమెరాలు ఏర్పాటు చేసే విధంగా చూడాలన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని పాటిస్తూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో స్నేహపూర్వకంగా మెలిగి వారి ఫిర్యాదులను స్వీకరించి జవాబుదారీగా ఉండాలన్నారు. మహిళలు/చిన్నారుల సంబంధిత ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని ఆదేశించారు. పోలీస్ శాఖపై నమ్మకం పెంపొందించేలా సేవలు అందించాలని సూచించారు.

కార్యక్రమంలో ఏఎస్‌పి (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఎస్‌పి (క్రైమ్) యస్.వి. శ్రీధర్‌రావు, ఏఆర్ ఏఎస్‌పి అశోక్‌బాబు, డిఎస్‌బి డిఎస్‌పి బి.మరియాదాసు, అన్ని సబ్ డివిజన్ల డిఎస్పీలు యు.నాగరాజు, నారాయణ స్వామిరెడ్డి, డీటీసి డిఎస్పీ రామకష్ణ, ట్రాఫిక్ డిఎస్పీ శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ వెంకటేశ్వరరావు, డిసిఆర్‌బి సిఐ దేవప్రభాకర్, లీగల్ అడ్వైజర్ వేణు గోపాల్ పాల్గొన్నారు.

రీసర్వే అవకతవకలపై అవగాహన కల్పించాలి

రాష్ట్ర రైతాంగ సమాఖ్య ఉపాధ్యక్షులు యెర్నేని నాగేంద్రనాథ్



మాట్లాడుతున్న యెర్నేని నాగేంద్రనాథ్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

భూముల రీ సర్వేలో జరిగే అవకతవకలపై రైతులకు అవగాహన కల్పించాలని రాష్ట్ర రైతాంగ సమాఖ్య ఉపాధ్యక్షులు యెర్నేని నాగేంద్రనాథ్ తెలిపారు. స్థానిక రంగా భవన్‌లో ఆచార్య రంగా కిసాన్ సంస్థ ఆధ్వర్యంలో జాతీయ రైతు దినోత్సవం, మాజీ ప్రధాని చౌదరి చరణ్ సింగ్ 120వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భగా రైతులకు భూముల రూసర్వే సమస్యలు రిజిస్ట్రేషన్ చట్టం సెక్షన్ 22 నిషేధితక భూముల సమస్యలపై అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ఆచార్య రంగా కిసాన్ సంస్థ ఉపాధ్యక్షులు నామినేని మోహనరావు, అధ్యక్షత వహించారు. కార్యక్రమాన్ని ప్రధాన కార్యదర్శి చుంచు శేషయ్య నిర్వహించారు. సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పెంట్యాల హనుమంతరావు, రాష్ట్ర రైతు సంఘం నాయకులు కెవివి ప్రసాద్, డాక్టర్ కొల్లా రాజమోహనరావు, దేవరపల్లి సుబ్బారెడ్డి, పరిటాల కోటేశ్వరరావు కోడూరి హనుమంతరావు, చుండూరు రంగారావు, వీరారెడ్డి, గుమ్మళ్ల నరసింహారావు, డాక్టర్ నాదెండ్ల చంద్రశేఖరరావు, మండవ రంగారావు, మండవరపు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కొర్రీలు వేస్తున్న అధికారులపై

చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు



మంత్రితో మాట్లాడుతున్న నీలం నాగేంద్రరావు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఎస్సీ ఎస్టీలపై హత్యాచారం, బలవన్మరణం కేసుల్లో ఉద్యోగాల రిలీఫ్ ఇవ్వకుండా సంవత్సరాల పాటు కొర్రీలు వేస్తున్న రెవెన్యూ, కలెక్టరేట్ అధికారులపై ఎస్సీ, ఎస్టీ యాక్ట్ కేసులు నమోదు చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి మేరుగ నాగార్జునకు దళిత నేత నీలం నాగేంద్రరావు ఫిర్యాదు చేశారు. శుక్రవారం ఒంగోలు కలెక్టరేట్ లో సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఇన్‌ఛార్జి మంత్రిని వినతిపత్రం అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో వివిధ సంఘాల నాయకులు దారా అంజయ్య, జంద్రాజుపల్లి ఆంజనేయులు, వేలూరి శ్రీనివాస్ రావు, తానికొండ ఆనంద్ ఉన్నారు.